సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి :7 జనవరి, 2011 సంచిక : 8

(వికృతి నామ సం॥, పుష్య మాసం)



**గౌరవ సంపాదకత్వం**

శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ

**ప్రధాన సంపాదకత్వం**

శ్రీ మాతా శుకవాణి
భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

శ్రీ వి.వి. కృష్ణారావుగారు
(సాయిశ్రీ ప్రింటర్స్)

**ప్రచార సారథ్యం**

శ్రీ ఎం. సత్యనారాయణగారు M.Tech


**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి .......... | రూ॥ | 6/- |
| వార్షిక చందా .......... | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం .......... | రూ॥ | 600/- |


**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి (పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.


**Ph : 08685-326053**
**9440413455, 9848133565**


**విషయసూచిక** **పుటసంఖ్య**


మా వాణి ........ 2
కథనవాణి ........ 5
శిష్య లక్షణాలు ........ 8
ఒకవేళ ఇలా ఐతే ........ 11
శుభాకాంక్షలు ........ 12
లేఖావాణి ........ 13
సర్వం సాయిమయం ........ 14
దాతంటే ........ 15
అప్పడపు పాట ........ 16
సాయే సత్యం-సర్వం మిథ్య ........ 17
రుద్రగీత ........ 19
అన్ని పరిస్థితులలోనూ ........ 21
బాలవాణి ........ 23
కృతజ్ఞత చెప్తున్నామా? ........ 25
సంస్కృతి ........ 27
మంగళాశీస్సులు ........ 28
ఆదిగురువు-దత్తప్రభువు ........ 29
మాతృసంస్థ కబుర్లు ........ 33
మాతృసందేశం ........ 35
స్వాతంత్ర్య సమరయోధుల ........ 38






ఓం శ్రీ సచ్చిదానంద సమర్థ సద్గురు సాయినాథ మహరాజుకూ జై!

ప్రియ సాయివాణి పాఠకులందరికీ 2011 నూతన సంవత్సర శుభాకాంక్షలు. 1990 జనవరిలో ప్రారంభమై నేటికి 21 సంవత్సరాల ప్రాయం పూర్తి చేసుకొన్న సాయివాణిని పెద్దలంతా ఆశీర్వదించండి.

గత సంవత్సరం కన్నా యీ సంవత్సరకాలంలో సాయివాణిలో గణనీయమైన మార్పులు వచ్చాయి. అట్టలో, ముఖ పత్రాలంకరణలో, లోపల అప్పుడప్పుడూ చిత్రాలతో అలంకరించటంలో, వివిధ రకాల విషయాలను స్పృశించటంలో, వివిధ యోగీశ్వరులకు సంబంధించిన బోధలు, కథలు అందించటంలో, పిల్లల కోసం చిన్న చిన్న కథలు అందించటంలో, చివరికి పేకింగ్‌లో కూడా నాణ్యత పెంచుకొన్నది. ప్రశ్నోత్తర పీఠంలో వచ్చే గురుదేవుల సమాధానాలు ఎందరికో మార్గదర్శకాలు కాగా, ఆదిగురువు-దత్తప్రభువు ఎందరో భక్తులను ఆకట్టుకొంటున్నది. యథాప్రకారం మాతృసంస్థ కబుర్లు మాకూ సమాజానికీ వంతెన కడుతుండగా, మావాణిలోని అనేక విషయాలు అభినందనలకు నోచుకున్నాయి. ముఖ్యంగా జూన్‌లో 'ఉపాధ్యాయుల"ను గూర్చీ, ఆగస్టులో "సంస్కారం" గురించీ, అక్టోబర్‌లో "జీవన సౌందర్యం", నవంబర్‌లో "దీపం" గురించీ, అదే నెలలో మన "ఆచారాలు-శాస్త్రీయత" గురించీ వచ్చిన వ్యాసాలన్నీ ఎంతో మన్ననకు నోచుకున్నాయి. అభిమానులు ఆదరంతో చేస్తున్న ఫోన్‌లూ, ప్రేమతో వ్రాస్తున్న లేఖలూ మా యీ కృషిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నాయి.

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి అనుభవాలు-జ్ఞాపకాలు, శ్రీ భమిడిపాటి రామగోపాలం గారి 'ఆరామ గోపాలం,' సాక్షి వ్యాసాలు, శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు గారి 'స్వీయ చరిత్ర' మొదలైన గ్రంథాల నుండి తీసి వ్రాయబడిన చిన్న చిన్న భాగాలు, స్వామీ వివేకానంద, స్వామీ రామా, స్వామీ శ్రీ కాంతానంద,

స్వామీ యతీశ్వరానంద, స్వామీ యుక్తేశ్వరానంద మొదలైన వారి గ్రంథాల నుండి గ్రహించిన బోధలు కూడా ఎందరినో ప్రభావితులను చేసాయని చెప్పారు పాఠకులు.

శ్రీ సాయినాథుల వారు అనేకానేక సందర్భాలలో చూపిన లీలలు, వారి అమూల్యమైన బోధలు అందించబడ్డాయి. ఆయా సందర్భాలలో మాకు తమ అమూల్యరచనలను అందించిన వారందరికీ కృతజ్ఞతలు. "ఈ నెలలో మాతృసంస్థ కబుర్లు వ్రాయలేదేం?" అనో, 'ఒక్కపాటైనా లేదు' అనో దబాయించే అభిమానులకూ, "బాలవాణిలో ఫలానా కథ నిజంగా పిల్లలకు మాత్రమే కాదు - మాకూ ఎంతో వర్తిస్తుంది" అంటూ కరిగిపోతూ పలకరించే పాఠకులందరికీ మా కృతజ్ఞతలు.

రెండు మూడు నెలల క్రితం పాఠకులందరి టెలిఫోన్ నంబర్లు పంపవల సిందిగా కోరితే-వచ్చినవెన్నో తెలుసా? మొత్తం పదిహేను. మిత్రులారా, మీరు కేవలం పాఠకులుగా మిగిలిపోకండి. క్రమక్రమంగా సంస్థకు సన్నిహితంగా రండి. సేవారంగంలో మాతో కలసి నడవండి. ఏ తుఫానులో వస్తాయి. ప్రమాదకరమైన భూకంపాలు, వరదలు వస్తాయి. అలాంటప్పుడంతా సాయిధామం వారి సాయి సైనికదళం కరసేవకు వెడుతుంటుంది. అప్పుడు మీ అందరి సహకారం కావాలంటే మా దగ్గర మీ ఫోన్ నంబర్లుండవు. ఏదో పెద్ద ఉత్సవం జరుగుతుంది. మిమ్మల్నందర్నీ పిలవాలని మాకుంటుంది. కవరుకు పోస్టేజీ ఐదు రూపాయలు. ఫోనైతే రెండు రూపాయలు. మీ ఫోన్ నంబర్లుండవు. ఎలా కలవగలం? అందుచేత వెంటనే మీ చిరునామా, చందా నంబరు, ఫోను నెంబర్లతో కార్డులు వ్రాయండి - మర్చిపోకండేం!

పోతే ఇరవై ఒక్కేళ్లనాటి లైఫ్ మెంబర్లకు కూడా (వారి చందా గడువు 12 సం॥ (పుష్కరం) తీరిపోయి తొమ్మిదేళ్లైనా) యింకా పత్రిక పంపుతూనే ఉన్నాము. అలాగే 16 సం॥, 18 సం॥, 14 సం॥ క్రితం కట్టిన వారికి కూడా యిలా వస్తూనే ఉన్నాయి. మీ అందరికీ మా వినతి ఏమంటే - తిరిగి మీ లైఫ్ మెంబర్‌షిప్ (ఆజీవ సభ్యత్వాన్ని) రెన్యూ చెయ్యండి. రూ.600/- ఎంతో బరువు కాదు మీకు - ఈ రోజుల్లో. అంచేత ఒక్క నెలలోపుగా రెన్యూ చేసుకోండి.





మామూలు చందాదార్లు కూడా ఆజీవసభ్యులుగా మారండి.

అలాగే మీ బంధుమిత్రులకు ఏదైనా చిన్న బహుమతి - ఏ పుట్టిన రోజుకో, ఫంక్షన్లకో యివ్వాలనుకొన్నపుడు సాయివాణికి వారి పేరిట చందా కట్టండి. మీ పరిధిలో ఉన్న వారికి మీకు వచ్చే పత్రిక చూపించి, వారిని చందా దారులుగా చేర్పించే ప్రయత్నం చేసి పత్రికకు సహకరించండి. దీన్ని ఇంతకన్నా సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలన్నా, చిరస్థాయిగా దీన్ని నిలపాలన్నా కొంత మూలనిధి అవసరం ఉంటుంది. ఆ పనిలో మీ చేయూత నిస్తారా? స్వాగతం!

మిత్రులారా,

ఆర్థికంగా మాత్రమే కాదు - పోయిన సంవత్సరమే చెప్పాము - మీకు సాయితో ఉన్న అనుబంధాలను, అనుభవాలను వ్రాసి పంపండి. ఈ నెల నుండీ ప్రవేశపెడుతున్న క్రొత్త శీర్షిక "నేను సాయి ఒడిలోకి ఎలా చేరాను?"లో ప్రచురిద్దాము.

సాయివాణి ద్వారా పరిచితులై మా సంస్థ అభిమానులుగా, కార్యకర్తలుగా మారిపోయిన ఎ. విశ్వనాథం, కె. జగతి, శ్రీ వి.వి. కృష్ణారావు, శ్రీ సి. సుబ్రహ్మణ్యం గారు - ఇంకెందరెందరిలాగానో మీరు మాలో ఒకరుగా నిలిచిపోవాలని ఆహ్వానిస్తూ,

సదా మీ స్నేహ సహకారాలు కాంక్షిస్తూ

- ప్రధాన సంపాదకురాలు

**ప్రియ మిత్రులారా,**

**మన పరమపూజ్య గురుదేవుల మంగళప్రవచనం "సాయివాణి" పేరిట ప్రతి సోమవారం రాత్రి గం.8-30 ని.లకు భక్తి టి.వి. ఛానల్‌లో ప్రసారమవుతున్నది. విని తరించండి. సందేహాలుంటే సాయివాణి పత్రికకు వ్రాయండి.**

# కథన వాణి - నిప్పరవ్వ

- శుకవాణి

చాలా ఏళ్లుగా ప్రక్క వీధిలో జరిగే సత్సంగాలకు హాజరవటం సుందరానికి అలవాటు. ఆఫీసులో ఆరురోజులపాటు అతలాకుతలం అయ్యాక - ఆదివారం నాడు ఓ రెండు గంటలసేపు సత్సంగంలో కూర్చోవటం అతనికెంతో హాయిగా ఉండేది. పెద్దా, చిన్నా, పేద, ధనిక, స్త్రీలు, పురుషులు అన్న భేదాలేవీ లేకుండా అందరూ కలిసి హాయిగా గొంతులు కలిపి భజనలు చెప్పటం, గీతార్థాలు వెదకటం, పారాయణలు చెయ్యటం, తమకు తోచిన - లేదా ఆ వారంలో తాము చదివిన విషయాలు ఒకరితో ఒకరు పంచుకోవటం - యిదంతా అతనికి ఒక రిలాక్సేషన్ - అంటే ఆటవిడుపుగా (అందాం) ఉండేది. పైగా అది కూడా జ్ఞానాన్ని సంపాదించుకొంటూ. సుందరం ఆదివారం సాయంత్రం ఖచ్చితంగా సత్సంగానికే కేటాయించుకొన్నాడు.

అలాంటి సుందరానికి ఒక సమస్య ఎదురైంది. వాళ్ల బంధువులలో ఒకరికి జబ్బు చేసి నగరానికి తీసుకువచ్చారు. సుందరం వాళ్లను హాస్పిటల్‌కు తీసుకు వెళ్లటం, వైద్యం చేయించటం, వాళ్ల కోసం వచ్చేపోయే చుట్టాలకు అతిథి మర్యాదలు చేయటం - వీటితో తల మునకలైపోయాడు. అలా రెండు వారాలు గడిచిపోయాయి. రెండు వారాలపాటు సత్సంగానికి వెళ్లలేకపోయాడు. మొదటి వారం చాలా బాధపడ్డాడు. ఇంట్లో తన వాళ్ల మధ్య ఉన్నప్పటికీ ఎంతో వెలితిగా, ఒంటరిగా ఫీలవుతూ గడిపాడు. ఆ తరువాత శనివారం లోపల రెండు మూడు సార్లు సత్సంగం మిత్రులు, ఆ కబుర్లు గుర్తు చేస్తే "అయ్యో! అనుకొనేవాడు. రెండవ వారంలో ఆ జ్ఞాపకాలు కాస్త తక్కువగా వచ్చాయి. రోగం కాస్త తగ్గింది అతని బంధువుకి. లేచి కూర్చొని తనకు కష్టంలో సాయపడిన సుందరాన్ని ఎంతో మెచ్చుకొన్నాడు. పదేపదే తమ కృతజ్ఞతలు చెప్పకున్నారు అతని భార్యా, కొడుకూ వగైరాలు. అటుపైన వాళ్లంతా వెళ్లిపోయారు. ఆ రోజు బుధవారం. ఆ రాత్రి సుందరానికి తన సత్సంగ మిత్రులంతా జ్ఞాపకం వచ్చారు. 'ఆదివారం తప్పక కలవాలి వాళ్లందరినీ' అనుకొన్నాడు.

శుక్రవారం ప్రొద్దుటే ఫోన్ వచ్చింది. అత్తగారింటి నుంచీ - బావమరిది





కొడుక్కి పెళ్లిసంబంధం ఏదో ఉందిట - చూపులు మద్రాసులోనే. ఎలాగూ సుందరం వాళ్లు యిక్కడే ఉంటున్నారు గనుక ఆ వేళే బయలుదేరి అందరం వస్తున్నామనీ, శనివారం ఆ కార్యక్రమం పూర్తయ్యాక ఆదివారం మధ్యాహ్నం బండికి వెళ్లిపోతామనీను. సుందరం భార్యకు ఇతను చిన్న తమ్ముడు గనుక యీ పెళ్లి చూపుల వాడంటే తగని ప్రేమ. ఇక యిల్లంతా కోలాహలం. వాళ్లు వచ్చారు - పెళ్లిచూపులయ్యాయి. నచ్చుకోవడాలయ్యాక యిచ్చుకోవడాలు, పుచ్చుకోవడాలు, ఎవరి వంశాన్నీ పిల్లలనూ వాళ్లు తెగమెచ్చుకోవడాలు వగైరాలన్నీ పూర్తయ్యేటప్పటికీ శనివారం కరిగిపోయింది. విందుభోజనాలు ఏర్పాటు చేసింది సుందరం భార్య తన పుట్టింటివారికి. ఆ హంగామా పూర్తై, వాళ్లతో సరదాగా (ఈ ప్రపోజల్ సుందరం భార్యది) స్టేషన్ దాకా వెళ్లి, రైలెక్కించి, దాన్ని స్టేషన్లోంచీ నెట్టేసేప్పటికి నాలుగున్నర దాటింది. ఓ కప్పు ఎక్స్ప్రెసో కాఫీ తాగేసి ఆలుమగలు కబుర్లు చెప్పకొంటూ బస్టాప్‌కు వచ్చేసరికి-

"ఏమండోయ్, చూచారా ట్రినిటీ థియేటర్‌లో నర్తనశాల వచ్చిందట! అదుగో వాల్‌పోస్టరు - చూడండి. అబ్బ! చాలా రోజులైందండీ మనం కలిసి వెళ్లి. ఎస్వీ రంగారావు సినిమా గదా - వెడదామండీ!" అన్నది సుందరం భార్య ఆశగా అతని ముఖంలోకి చూస్తూ. సావిత్రి ఉంటే చాలు సుందరానికి - ఏ సినిమా అయినా ఫరవాలేదు. పైగా పాత సినిమాలంటే చచ్చే క్రేజ్ యిద్దరికీ. ఇంకేం - ట్రినిటీ వైపే సాగాయి కాళ్లు.

◆ ◆ ◆

విపరీతమైన చలిగా ఉంది. సుందరం భార్య వాళ్ల ఫ్రెండ్ యింట్లో ఏదో పేరంటం ఉందంటే వెళ్లింది. వచ్చేటప్పటికి ప్రొద్దు పోవచ్చునని చెప్పి మరీ వెళ్లింది. ఎదురింటి వాళ్ల మూర్తి వచ్చి కాస్సేపు కబుర్లు చెప్పి వెళ్లాడు. అతన్ని సాగనంపడానికి గేటు దాకా వెళ్లిన సుందరానికి తోటలో ఉన్న ఎండుపుల్లలన్నీ విరిచి పెట్టిన చిన్న గుట్ట కన్పించింది. "ఈ పని వాడెప్పడూ ఇంతే - ఏ పనీ చక్కగా చివరంటా చెయ్యడు-విరిచిన పుల్లలు బయట పారెయ్యొచ్చు గదా!" అనుకొన్నాడు. అంతలోనే అతనికో చిన్న ఆలోచన వచ్చింది. ఈ పుల్లలు వృథాగా పోనివ్వటం ఎందుకూ! ఏదో బాల్యోత్సాహం లాంటిది పొంగి వచ్చింది. ఇంట్లోకి వెళ్లి, అగ్గిపెట్టె తెచ్చాడు. మధ్యలో ఓ లావుపాటి కర్రపెట్టి, చుట్టూ పుల్లలు పేర్చాడు.

మంట రగిలించి, హాయిగా దాని ముందు కూర్చొని చలి కాగసాగాడు. తన బాల్యంలో పిల్లలంతా కలిసి చలిమంటలు వేసుకోవటం, సంక్రాంతి భోగి మంటలు, నరకాసుర దహనాలు - ఏవేవో గుర్తు చేసుకుంటూ తనలో తానే ఆనందిస్తూ ఒక్కో కర్రపుల్లా మంటకు చేరుస్తూ ................ ఓ పావుగంట అలా గడిచింది.

గేటు తెరుచుకొని లోపలికి వచ్చారు ప్రభాకరంగారు. ఆయన్ను చూస్తూనే చటుక్కున లేచి నిలబడి, "నమస్కారమండీ!" అన్నాడు సుందరం. ఆయన చిరునవ్వు నవ్వి తాను కూడా మంట ముందే కూర్చున్నారు. ప్రభాకరంగారు వయోవృద్ధులు. వారం వారం సత్సంగం నిర్వహించేది ఆయనే. మంచి చింతన, చక్కని వాగ్ధార, ఉపదేశశక్తి, దానికి తగిన ఆచరణ కూడా ఉన్నవారు. ఆయనంటే సుందరానికి భక్తి, భయం కూడా ఉన్నాయి. "మనం లోపలికి ......" సుందరం అంటే ప్రభాకరంగారు "వద్దు" అని చేత్తోనే సైగచేసి, ఎగుస్తున్న మంటల వైపే చూస్తూ కూర్చున్నారు. సుందరం కూడా కూర్చుండిపోయాడు. చక్కని రంగుతో వెలుగు, వేడీ కూడా చిమ్ముతోంది మంట. సుందరం కొత్త కర్రలు వేసాడు. చాలా క్షణాలు అలా నిశ్శబ్దంలో కరిగిపోయాయి. సుందరానికి కొంచెం గిల్టీగా ఉంది. నేరం చేసినవాడు న్యాయపతి ముందర నిలబడవలసి వస్తే బెరుకుపడినట్లుగా ఉంది అతని స్థితి.

ఉన్నట్లుండి ప్రభాకరంగారు మండుతున్న పెద్దకర్ర బయటికి లాగి, దాని చివర కణకణలాడే నిప్పును బయట నేలమీద పడేసారు. కర్ర మళ్లీ మంటలో వేసారు. ఓ అరనిముషంలో ఆ నిప్పపైన బూడిద అలుముకొన్నది. మరో నిమిషానికి నిప్ప పూర్తిగా ఆరిపోయింది. బొగ్గు మిగిలింది. ఇంకా నిశ్శబ్దం అలా కొనసాగుతూనే ఉంది. మరో నిమిషం తరువాత ప్రభాకరంగారు చల్లారిన బొగ్గును మళ్లీ మంటలో వేసారు. ఓ అరనిమిషం తర్వాత అది తిరిగి కణకణ లాడసాగింది. ప్రభాకరంగారు లేచి నిలబడి 'వస్తా మరి!' అన్నారు వెళ్లిపోతూ. "ఈ వారం తప్పకుండా వస్తాను-సారీ!" అన్నాడు సుందరం. అతని వీపు మీద తట్టి, చిన్నగా నవ్వి వెళ్లిపోయారు ప్రభాకరంగారు.

ఈ కథ చదివారుగా! దీని మీద విశ్లేషణ ఆహ్వానిస్తున్నాం. మీదైన ధోరణిలో విశ్లేషించి పంపండి. చక్కని విశ్లేషణకు, వివరణకు-ఒక సంవత్సరంపాటు సాయివాణి మీరు కోరిన చిరునామాకు పంపటమే బహుమతి.)





# శిష్య లక్షణాలు

**శ్రీశ్రీశ్రీ సమర్ధ రామదాసస్వామి**

**- "దాసబోధ" ఆధారంగా)**

మంచి శిష్యుడు, మంచి గురువు - ఇద్దరూ జత పడితేనే లోకశ్రేయం. సారవంతమైన గింజలు ఊసర క్షేత్రంలో నాటితే ఫలించవు. అలాగే భూమి ఎంత సారవంతమైనా చచ్చు విత్తనాలు చల్లితే పంట సరిగా పండదు. (మంచి ముత్యం తయారు కావాలంటే స్వాతి వానచినుకు ముత్యపు చిప్పలో పడాలి. అది స్వాతికార్తెలోని వానచినుకు కాకపోయినా - పడేది ముత్యపుచిప్పలో కాకుండా సముద్రంలోనో, ఇసుకమీదో, నేలమీదో ఎక్కడో పడినా వ్యర్థమే- అన్నది మనకు అనుభవమే. అందుచేత గురుశిష్యులిద్దరూ యోగ్యులైనప్పడే పరమార్థం అన్నది చేకూరుతుంది. అయితే - మధ్యలో యింకొన్ని చిక్కులు కూడా ఉన్నాయి. నేలా, విత్తనం రెండూ మంచివే. కానీ, సాగు సకాలంలో సాగాలి. అదునున వర్షం కురవాలి. అటుపైన కాపలా కూడా ఉండాలి. అలాగే సాధన అదునులో - పూర్తిగా జవసత్వాలు ఉడిగిపోకముందే ప్రారంభించటం అవసరం. తన సాధనలోని లోపాలు సరిచేసుకుంటూ, కలుపు మొక్కల్లాటి అవరోధాలు తొలగించుకొంటూ నడవాలి. గురు కృపారసానికి పాత్రులు కావాలి. అంతా అయ్యాక పునరాలోచన, మననం తప్పనిసరి. మొత్తం మీద సద్గురువు చెంత ఉన్న శిష్యునికి అభ్యాసం, శాస్త్రవిచారం, సత్కర్మ, స్వధర్మ నిష్ఠ, సత్యనియమం, సదాచరణ ఇవన్నీ ఉన్నప్పడే విమలజ్ఞానం కలుగుతుంది.

శిష్యుని అత్యంత ముఖ్యధర్మం గురువు పట్ల అనన్యభావంతో కూడిన విశ్వాసం ఉంచటం. శిష్యుడు పవిత్రాత్ముడు, విరక్తాత్ముడూ, మోక్షాసక్తుడూ కూడా అయి వుండాలి. ధైర్యశాలీ, పరోపకారీ, మాత్సర్యం లేనివాడూ, అవగాహన కలవాడూ అయి ఉండాలి. ప్రజ్ఞ, యుక్తి, నిత్యానిత్య విచారణ శక్తి, సాత్త్వికత, ప్రేమ, మర్యాద - యివన్నీ శిష్యునికి కావలసిన లక్షణాలు.

అంతేకాక శరీరశ్రమకు ఓర్చుకొనే గుణం అతనికి చాలా అవసరం. పుట్టుక

నుండీ సుఖభోగపరుడైనవాడు పనికిరాడు. ప్రపంచంలోని దు:ఖాలకు తపించి కృశించినవాడైతే - అట్టి వాని వైరాగ్యం దృఢంగా ఉంటుంది. గురూపదేశం పట్ల దృఢమైన విశ్వాసం ఉన్నవాడే మోక్షానికి అధికారి - అంటే మోక్షం పొందగల యోగ్యుడవుతాడు. గురువు కన్నా దేవతలు ఎక్కువని భావించేవాడు మూఢుడు. వాడు దేవతలు ప్రసాదించే వైభవాలకు, సామర్థ్యాలకు మురిసిపోయి శాశ్వత సత్యం నుండి దూరంగా తొలగిపోయినట్లు. సద్గురువును సామాన్య గురువులతోను, దేవతలతోను సమానంగా తలచే శిష్యుడు దురాచారి అనవచ్చు. సద్గురువు మాటల మీద దృఢవిశ్వాసం ఉన్న శిష్యుడు క్రమక్రమంగా తాను కూడా గురువుస్థాయికి చేరతాడు. సచ్ఛిష్యుడు సద్గురుని శరణ్యాన్ని ఎన్నడూ విడువలేడు. అలాకాక వ్యతిరేక మార్గంలో - అంటే శిష్య వేషధారులై ఉండి కూడా గురువును అనుసరించని వారిని అసత్‌శిష్యులుగా - అంటే దొంగ శిష్యులుగా భావించాలి.

విషయసుఖాలు తొందరపెట్టగానే దుర్బలురైన శిష్యులు మళ్లీ యింటివైపే పరుగులు తీస్తారు. దానితో సాధించిన కాస్త పరమార్థమూ నశించిపోతుంది. అంతటితో ఆగరు. ఈ పరమార్థం సాధించామన్న నెపంతో కుటుంబభారాన్ని సరిగా మొయ్యరు. చివరికి రెంటికి చెడిన రేవడలవుతారు. వాళ్లకు ప్రపంచంలో ఆనందం ఉన్నదన్న భ్రమ తీరదు. పైకేమో ఆధ్యాత్మిక వాదుల్లాగా నటిస్తారు. ఇలాటి వ్యక్తులకు బ్రహ్మజ్ఞానంగానీ, వివేకంగానీ బోధించాలనుకోవటం గురువులకు వృథా ప్రయాసమే. పందికి పరిమళలేపనం పూసినట్లు, గేదెకు చందనం పూసినట్లూ అవుతుంది. బొల్లి గ్రద్ద రాజహంసల మధ్య చేరి వాటితో తానూ సమానమని ప్రేలాపనలు చేసినా - దాని మనసు శవాల మీద, అసహ్య పదార్థాల మీదే ఉంటుంది. అలాగే యిలాటి శిష్యులు సజ్జనుల మధ్యలో ఉండి తాను కూడా సజ్జనుడనిపించుకొంటున్నప్పటికీ అతని ఆంతర్యం మాత్రం విషయలాలసలతోనే నిండి ఉంటుంది. ఇటువంటి వారు గురువు ముందు తమ హృదయం పరిచి, తమ దోషాలకు క్షమార్పణ కోరి, గురుకృపకు పాత్రులు కాకపోతే నరకాల పాలవుతారు. అది కూడా ఏదో స్మశానవైరాగ్యంతో కాదు- నిర్మలచిత్తంతో వేడుకోవాలి.





కొందరు శిష్యులు ఒక గురువు దగ్గర చేరి వినయం చూపి ఒక మంత్రం గ్రహిస్తారు. మూన్నాళ్ల ముచ్చటగా ఆ గురుసేవ ముగించి మరోచోట చేరతారు. ఇలా అనేకుల దగ్గర చేరి ఏవేవో పాషండ పదాలు నేర్చుకొని అవే వాగుతూ పాషండులైపోతుంటారు. ఒక్కసారి ఏడుస్తారు - మరోసారి స్పృహ తప్పి పడిపోతారు - ఇంకోసారి తానే దేవుడిని వేదాంతంతో, వాగాడంబరంతో ఏమేమిటో నటిస్తారు.

అల్పుడైన శిష్యుడు ఆకలిదప్పికలను సహించలేడు. నిద్రకు కాస్త కూడా ఆగలేడు. స్వసుఖాన్ని విడువలేడు. దయ, తృప్తి, సద్వృత్తి ఉండవు. శరీరాన్ని ఏ మాత్రం శ్రమ పెట్టుకోడు. అంటే - ఒళ్లు అలవనివ్వడు. సాంసారిక జనంతో సరళంగా ప్రవర్తించడు. పరులకు కలిగిన దు:ఖానికి ఆనందిస్తాడు. మాయ మాటలు చెప్పి చుట్టూ వారిని మోసగిస్తాడు. తన దు:ఖానికి ఏడుస్తూ, పరుల దు:ఖానికి ఆనందించే యిలాటి వారికి ఘోరనరకం తప్పదు.

పైన చెప్పిన దుర్గుణాలేమీ లేనివాడు మాత్రమే సచ్ఛిష్యుడు. అతడు తన గురుసేవ, దృఢభక్తి వలన స్వానంద సౌఖ్యం అనుభవిస్తారు. ఇలా సచ్ఛిష్యులుగా ఉన్నవారు తమ సాధనతోపాటు తమ గురువుల శ్రమను కూడా సఫలం చేయగలరు.

**శ్లో॥ దాతా దరిద్ర:, కృపణో ధనాఢ్య:**
**పాపీ చిరాయు: సుకృతీ గతాయు:**
**రాజాऽకులీన: సకులీ చభృత్య:**
**కలౌయుగౌషడ్గుణమాశ్రయంతి ॥**

భావం : దానం చేసేవాడు పేదవాడవుతాడు, పిసినారి ధనికుడవుతాడు. దుర్మార్గుడు చాలాకాలం బ్రతుకుతాడు. మంచివాడు తొందరగా మరణిస్తాడు. పరిపాలకుడు నీచుడవుతాడు. సేవకుడు ఉత్తముడౌతాడు. ఈ ఆరు కలియుగంలో సహజంగా వ్యాపిస్తాయి.

సేకరణ : కె.ఆర్. విజయకుమార్

# ఒక వేళ ఇలా ఐతే!

మూలం :

అనుసరణ : అరవింద

విలియం స్టాఫర్డ్ వ్రాసిన ఒక ఆంగ్ల పద్యానికి అనుసరణ.
ఇది క్లాసులో చెప్తున్నపుడు పిల్లలలో కలిగిన స్పందన, సజలాలైన వాళ్ళ కళ్ళు చూచాక – మా పాఠకులకు కూడా అందించాలనిపించింది.

\- సంపాదకులు

నీవు కన్ను తెరిచిన మరుక్షణం
ఊయలలోనే తారుమారైతే -
ఆ రహస్యం వెలికి రాకముందే
నిను కన్నతల్లి కన్నుమూస్తే .......
నీకంటూ ఊరూ పేరే ఉండదు.
ఈ విశాల విశ్వంలో
నిన్న గన్నతండ్రి ఎక్కడున్నాడో
నీవున్నావన్న నిజంగానీ
నీ కతను అవసరమనిగానీ
అతనికి తెలియదు - తెలిసే వీలేలేదు.

ఝంఝామారుతం తీవ్రంగా వీస్తున్నపుడు
ఏనుగు తొండాలతో క్రుమ్మరిస్తున్నట్లుగా వాన ....
వీధిలో ఓ మూల నువ్వు ఒంటరిగా వణుకుతూ ....
నీ ప్రక్కగా నడిచి వెడుతూ ఎంతోమంది జనం.
ఏం పట్టనట్లున్న వాళ్ల నిశ్శబ్దం - నీకెంతో ఆశ్చర్యం!
నీ మనసు లోతులలో క్షణక్షణం మెదిలే ప్రశ్న
వాళ్ల చెవుల పడనే లేదు -
"ఓయి సంచారీ, ఇంతకీ నీవెవరివి?" అని.
అయినా నువ్వే జవాబు చెప్పకో -
నీ చుట్టూ ప్రపంచం





నీ పట్ల ఎంత నిర్లిప్తంగానైనా ఉండనీ -
ఎంత నిరాశాజనకంగానైనా ఉండనీ -
ఫర్వాలేదు - ధైర్యంగా చెప్ప -
"ఏమో! కావచ్చునేమో నేనొక మహారాజు!

మన చుట్టూ ఉన్న లోకంలో కాలపురుషుని కరాళ కాఱు చక్రాల క్రిందబడి నలిగిపోయే గడ్డిపువ్వులెన్నో! వాటికీ రంగులున్నాయి. మృదుత్వం ఉంది - అందం ఉంది. కానీ, మనం వాటివైపు చూడం అంతే. ఏవో మనకెవ్వరికీ తెలియని కారణాల వలన అనాథలై వీధుల్లో పడిన బిడ్డలెందరో! వాళ్లలో ఆత్మ విశ్వాసం పాదుకొల్పటం, వాళ్లక్కూడా మామూలు పిల్లల్లా బ్రతికే ఛాన్స్ ఇవ్వటం మన ధర్మం కాదా! ఆలోచించండి.

## శుభాకాంక్షలు

ఇష్టానసైనా కష్టానసైనా మనం ఇంగ్లీషు గ్రిగేరియన్) కేలెండర్‌నే అనుసరిస్తున్నాం. సంస్కృతీపరంగా ఉగాది నూతన సంవత్సరాదిగా భావిస్తున్నప్పటికీ వాడుకలో మాత్రం జనవరి, ఫిబ్రవరి అంటూనే లెక్కిస్తున్నాం. అందుచేత మా ప్రియ సాయివాణి పాఠకులకూ, వారి కుటుంబాలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు జనవరి 14న సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. 2011వ సంవత్సరమైనా మన తెలుగుగడ్డపై అతివృష్టులూ, అనావృష్టులూ, అకాల వర్షాలు కాకుండా సకాల వర్షాలు ప్రసాదించి పాడిపంటలతో వర్థిల్లేలా ఆశీర్వదించాలి. ఈ ఏడాదైనా మన రాజకీయ నాయకులు కుక్కల్లా కాట్లాడుకోకుండా సవ్యమైన పద్ధతులతో నడిచి దేశ సౌభాగ్యాన్ని గురించీ, ప్రజాసంక్షేమాన్ని గురించీ ఆలోచించాలి. మన యువత మత్తులో, రాజకీయవాదుల ఎత్తుల్లో, సినిమాలు, ప్రేమలు, శృంగార ప్రదర్శనలు వంటి చెత్తలో పడి కొట్టుకుపోకుండా తామెవరో గ్రహించుకొని జీవించాలి. తెలుగింటి కుటుంబవ్యవస్థ చల్లగా వర్థిల్లాలి. శ్రీసాయినాథుల రక్షాహస్తం యీ గడ్డను చీడపీడల నుండీ కాపాడి ఆశీర్వదించును గాక! తథాస్తు!

# లేఖావాణి

పూజ్య గురుదేవులకు ప్రణామాలు.

నవంబరు పత్రికలో 'దీపం' గురించి చాలా సవివరంగా వ్రాసారు. మన 'ఆచారాలు-శాస్త్రీయత' వ్యాసం మన ఆచారాలు, సంప్రదాయాలు నిత్య జీవితంలో ఎంత ఉపయుక్తంగా ఉంటాయో చక్కగా వివరించి చెప్పారు. సుభాష్ దేశానికిచ్చిన స్ఫూర్తి ఎంత గొప్పదో తెలుసుకున్నాము. ప్రతి పత్రికలోని ప్రతి విషయమూ కూడా సామాజిక దృష్టి పెంచేదిగా ఉంటున్నది.

అభినందనలతో,

- వీరయ్య. ఆర్, దివ్య జీవన సంఘం

◆ ◆ ◆

'సాయివాణి' ప్రధాన సంపాదకులకు

నమస్సుమాంజలులు.

తమ మాసపత్రికలో ప్రతి నెలా మాకు అమూల్య సమాచారం అందుతున్నది. దేశవిదేశాలలో సాయిమందిర సౌందర్యం గూర్చి ఓసారీ మన లోపల దీపం వెలగటం గురించి ఓసారీ, స్వరాజ్య దీపం వెలిగించిన వారి గురించి ఓసారీ - యిలా రకరకాల విషయాలు టచ్ చేస్తున్నారు. నేను వృత్తిరీత్యా ఇంజనీరును. మీ యీ మంచి సమాజ నిర్మాణ ప్రయత్నం నాకెంతో ఆనందం కలిగిస్తున్నది.

- కె.వి. భానుమూర్తి, టెక్కలి.

To hear the voice of God what we need is silence Love for God grows in when silence is there.

◆ ◆ ◆

Service is the rent we pay for living. It is the very purpose of life.

◆ ◆ ◆





# సర్వం సాయిమయం

## సాయి చెప్పింది చేయడమే!

గణేశ విష్ణు బేరే అనేవాడు వ్యవసాయశాఖలో ఇన్‌స్పెక్టర్. అతడు బాబా దర్శనం కోసం షిరిడి పుణ్యక్షేత్రం వచ్చాడు. సాయిబాబాకు సాష్టాంగ నమస్కారం చేశాడు. సాయి అతనిని వెంటనే షిరిడీ విడిచి పొమ్మన్నారు. అంతేకాదు, ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయవద్దని, టాంగాను ఎక్కడా ఆపకుండా వేగంగా తోలుకొని కోపర్గాం అనే వూరును చేరవలసినదని సాయి అతనిని ఆజ్ఞాపించారు.

బాబా ఆజ్ఞకు తిరుగేముంది?

బేరే వెంటనే షిరిడి విడిచి టాంగాలో కోపర్గాం బయలుదేరాడు. టాంగావాడు కొద్దిగా నిదానంగా పోదామని, వెనుకే వస్తున్న టాంగాతో కలిసి తోడుగా పోవడం మంచిదని సలహా ఇచ్చాడు. బేరే అందుకు అంగీకరించలేదు. టాంగాను వేగంగా తోలమని ఆజ్ఞ ఇచ్చాడు. టాంగా వేగంగానే కోపర్గాం చేరింది. అచటకు చేరిన తర్వాత వారికి తమ వెనుక వస్తున్న టాంగాను దొంగలు దోపిడీ చేసి, ఆ టాంగాలోని వాళ్లను కొట్టినట్లు తెలిసింది. బేరే సాయి దయకు సంతసించి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

భక్తులు ఎంతో ప్రేమతో, ఎంతో దూరం నుండి షిరిడీలోని సాయి సన్నిధిలో కొంతకాలం గడుపుదామనే కోరికతో వస్తారు. అప్పుడు సాయి వెంటనే వారిని తమ గృహాలకు వెళ్ళమని ఆదేశిస్తే అమలు చేయాల్సిందే !

బొంబాయి నుండి కృష్ణాష్టమి ఉత్సవాలు చూద్దామనే ఆశతో షిరిడీ వచ్చిన కాకా మహాజనిని సాయిబాబా అతడు వచ్చిన మరునాడే షిరిడి నుండి పంపివేశారు. కారణం సాయి చెప్పరు. అనంతరం జరిగే సంఘటనల వల్ల తెలుస్తుంది. ఒకసారి కాకా మహాజని మరియు అతని స్నేహితునకు షిరిడి నుండి తిరిగి వెళ్ళుటకు బాబా సెలవు ఇచ్చారు. ఆకాశము మేఘములు కమ్మి

ఉన్నప్పటికీ వర్షము వచ్చునేమో అను భయము కలుగుచున్నప్పటికీ ప్రయాస లేకుండా ప్రయాణము సాగునని బాబా ఆశీర్వదించెను. ఇద్దరు సురక్షితముగా బొంబాయి చేరిరి. అతడు ఇంటికి పోయి తలుపు తీయుసరికి రెండు పిచ్చుకలు చచ్చిపడి ఉండెను. ఇంకొకటి కిటికీ ద్వారా ఎగిరిపోయెను. తానే కిటికీలు తెరచి ఉంచినచో పిచ్చుకలు రక్షింపబడి ఉండును. వాని అదృష్టానుసారముగా అవి చచ్చెను. మూడవ దానిని రక్షించుటకై బాబా త్వరగా తనను పంపెను అని కాకా అనుకొనెను.

సాయి శరణం - బాబా శరణం

బాబా శరణం - సాయి శరణం

సేకరణ : తిరుమలశెట్టి వేంకట సుబ్బారావు

# దాతంటే ...

ఒకానొక సత్పురుషుడు ఒక పర్వదినాన అనేక దానాలు చేస్తున్నాడు. వరసగా జనం వస్తున్నారు. ఆయన తన ముందుకు ఏ చేయి వస్తే ఆ చేతిలో ధనమో, వస్త్రాలో, వస్తువులో ఏదో ఒకటి పెడుతున్నాడు. అది చూచిన మిత్రుడొకడు "అలా కళ్లు క్రిందికి వాల్చుకొని, వచ్చిన వారి ముఖం చూడకుండా యిస్తున్నావు. వచ్చిన వారే మళ్లీ వచ్చి, తీసుకు వెళ్లే ప్రమాదం ఉంది గదా!" అన్నాడు. ఆ సజ్జనుడిలా అన్నాడు -

"మిత్రమా, ఇదంతా నాది కాదు. భగవంతుడిది. ఆయన నాకిచ్చి, నా ద్వారా ఇలా చేయిస్తున్నాడు. అది ఎవరికి చెందాలని ఆయన అనుకొన్నాడో వారికే వెడుతుంది. అందరూ నన్ను 'దాత' అంటున్నారు. అందుకు నాకు సిగ్గుగా ఉంది. అందుకే తలెత్తలేకపోతున్నాను".

అదీ దాతృత్వం ఉన్నవాడు ఆలోచించవలసిన తీరు.





# అప్పడప్పు పాట

శ్రీ శ్రీ శ్రీ రమణ మహర్షి

రమణ మహర్షుల వారి ఆశ్రమంలో ఒకనాడు అప్పడాలు ఒత్తుతున్నారు - వారి తల్లిగారు, భక్తులు కలిసి. రమణులు తాము కూడా అప్పడాలు ఒత్త సాగారు. "తమ వంటి మహనీయులు ఈ పని చేయాలా!" అని భక్తులు వారింప బోయారు. అప్పడు వారు చిరునవ్వుతో ఆశువుగా యీ పాట పాడారు. కనగలిగే కంటికి ప్రతి దానిలోనూ దైవమే కన్పిస్తాడు. యోచించగలిగిన మనసు ప్రతి దానిలోనూ ఆధ్యాత్మికతనే ఆనందించగలుగుతుంది. మరిప్పడు చదవండి.

- సంపాదకులు

పల్లవి : అప్పడ మొత్తిచూడు - అదితిని
నప్పడె నీయాశ వీడు

చరణం : తాను గాని పంచకోశ క్షేత్రమందు
తానుగా పెరుగు అభిమానమాషములను
నేనెవ్వడను విచారజ్ఞానతిరుగలి
నేను గానని పగులగొట్టి పిండియు జేసి - ॥ అ ॥

2. సత్సంగ మనియెడు నల్లేరు రసముతో
శమదమములను జీలకర్ర మిరియములు
ఉపరతి యనునట్టి యుప్పను గలిపి స
ద్వాసన యనియెడి యింగువను జేర్చి ॥ అ ॥

3. రాతి చిత్తము నేను నేనని భ్రమయక
లోదృష్టి రోకటితోను మానకదంచి
శాంతమౌ కొడుపుతో సమమగు పీటపై
సంతత మలయక సంతసంబుతోడ - ॥ అ ॥

4. మౌనముద్ర యనెడి ముగియని పాత్రమున
జ్ఞానాగ్నిచే గ్రాగు సద్బ్రహ్మ ఘృతమున
నేనది యగునని నిత్యమును బేల్చి
తను దానె భుజియింప దన్మయ మగునట్టి - ॥ అ ॥

మాషములు = మినుములు      కొడుపు = అప్పడాల కర్ర

# సాయి సత్యం-సర్వం మిథ్య

- శ్రీ తాతపూడి బ్రహ్మానందశాస్త్రి

యావజ్జగతికంతటికీ కారణభూతుడు, ఆది అంతం లేనివాడు, శుద్ధ చైతన్య స్వరూపుడు, కరుణాసాగరుడు, షిరిడీ నిత్యనివాసుడు, భక్తుని వెన్నంటి నీడలో నీడగా ఉండేవాడూ అయిన సాయిదేవుని అనన్యభక్తితో శరణు వేడదాం. మన పంచప్రాణాలు (ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానాలు) ఆయన పాదాలకు సమర్పిస్తే మన సంసారబంధనాలు అనివార్యంగా విడిపోతాయి. చిత్తంలో అఖండ శక్తి సమకూడుతుంది. తనువు, ధనము, మనస్సు సాయికే అర్పించి, ఆ సద్గురువు కోసమే ఆయువును వెచ్చించాలి.

పరమాత్ముడే సత్యం. మిగతావన్నీ మిథ్య - అంటే క్షణక్షణం మారిపోతుంటాయి. భగవంతుడు, ఆయన శక్తి, ప్రేమ అచంచలాలు. సాయి మనలోని మనోమాలిన్యాన్ని తుడిచి శుభ్రం చేసి, అందులో సాయిని ప్రతిష్ఠించుకోవాలి. బాబా రాజ్యభోగాలకన్నా దారిద్ర్యమే మేలని చెప్పేవారు. దరిద్రుడికి భగవంతుడే స్నేహితుడిగా ఉంటాడుగా మరి! దివ్యత్వాన్ని అనగా దైవీశక్తిని అనుభూతిలోకి తెచ్చుకొంటూనే తిరిగి సృష్టితో మమేకమవుతుండాలి. సాధారణంగా మానవుడు దైవాన్ని కూడా తనలాంటి మనిషిగానే భావిస్తూ, దేవుడు కూడా అలాగేనని స్తుతిస్తూ ఉంటాడు. పైగా పూజగదికి తాళం పెట్టేస్తే తాను బయట ఏమి చేసిందీ దైవానికి తెలియదనుకుంటాడు. ఈ భావమే మాయలోకి నెడుతుంది మనిషిని. చూచేదీ, చూడబడేదీ అంతా మాయే. ఆ సంగతి గుర్తుంచుకొని మన దృష్టిలో, మన ధ్యాసలో దైవాన్నే నిలుపుకొని, చిత్తశుద్ధితో నిశ్శబ్దంగా చేసే ప్రార్థనను దైవం త్వరగా ఆలకిస్తాడు.

అయితే మాయ మనను ఎలా వదులుతుంది? గురుకృప వలననే. గురు చరణాలు ఆశ్రయించిన వారి చెంతకు మాయ చేరలేదు. సూర్యకాంతిని చూచి చీకటి అల్లంత దూరాన ఆగినట్లే గురుసేవకుని చెంతకు మాయ చేరలేదు. సప్త సముద్రాల అవతల ఉండి అయినా సరే ధ్యాస తన మీద





నిలుపుకొన్న శిష్యుడిని గురువు అభయహస్తం ఆదుకొంటుంది. స్వయంగా పరమాత్ముడైన సాయి ఇహలోకంలో సద్గురువుగా నిలచి, మనను రక్షిస్తున్నారు. మహాభారత రచనకై వ్యాసుడు గణపతిని సాయం కోరితే - శ్రీ సాయి తన చరిత్ర వ్రాసుకోవడానికి హేమాడ్పంతును పనిముట్టుగా చేసుకున్నారు. సచ్చరిత్రలో తన లీలలు, తన భక్తుల అనుభవాలు - అన్నీ తాను వ్రాసుకొన్నారు హేమాడ్పంత్ మిషతో. అది మనకు బాబా అందించిన మార్గదర్శి.

ఎంతటి వేదవేదాంగ పారంగతుడైనా యీ ప్రపంచంలో జన్మించి తన ప్రారబ్ధకర్మలు అనుభవించి తీరవలసిందే. దైవాన్ని పొందడానికి ఎంతటి పాండిత్యమున్నా లాభం లేదు. దురాగ్రహం, నాది అన్న మమకారం, నేను అన్న అహంకారం విడిచిపెట్టాలి. 'ఉద్ధరే దాత్మనాత్మానం' అని స్మృతి గర్జిస్తుంది. అంచేత దైవాన్నీ, సద్గురువులనూ అనాదరణ చేసి మన ఆత్మ వినాశనాన్ని మనమే కొని తెచ్చుకోకూడదు. సాయంటే సుఖసంపద. అంతిమ గతి సాయే. వారి కృప వలననే సాయి చరిత్ర శ్రవణం, మననం లభిస్తాయి. తద్వారా దుస్తర భవభయ వినాశనం జరుగుతాయి. అందుకే - సాయే సత్యం, సర్వం మిథ్య.

రకరకాల ఆభరణాలు ధరిస్తూ, క్షణానికొక వేషం మారుస్తూ ఉండే వేశ్యను చూచి, పతివ్రత అయిన స్త్రీ "ఎన్నాళ్లు నా భర్తతో కలిసి జీవిస్తున్నాగానీ యీ మామూలు గుడ్డలూ, యీ నల్లపూసలే గదా! నాకు రంగురంగుల బట్టలూ, మంచి మంచి నగలూ లేక పోయెనే!" అని విచారించటం ఎంత నీచమైన విషయమో - భక్తుడైనవాడు ప్రాపంచిక వ్యక్తులకిచ్చిన సుఖభోగాలు దేవుడు నాకివ్వలేదే అని విచారించటం కూడా అంతటి నీచమైన విషయమే".

– శ్రీ కేశవతీర్థ స్వామి

# రుద్రగీత

-శ్రీ మద్భాగవతం నుండి

ప్రాచీన బర్హి అనే ఋషికి శతధృతి అనే సాగరకన్య పత్ని అయింది. వారికి ప్రచేతసులనే పేరుతో చెందిన పదిమంది కుమారులున్నారు. వారంతా తమ తండ్రిగారి ఆజ్ఞ ప్రకారం ప్రజాసర్గం (సృష్టి) కోసం తపస్సుకు వెడుతున్నారు. త్రోవలో వారికొక మనోహరమైన సరస్సు కనిపించింది. హంసలు, చక్రవాకాలు, తుమ్మెదలు, పరిమళాలెగబోసే పద్మాలు మొదలైన వానితో నిండిన ఆ సరస్సు సౌందర్యం వారినెంతో ఆకర్షించగా ఒక్క క్షణం ఆగిపోయి చూస్తున్నారు. అంతలో ఆ సరస్సులో నుండీ ఒక దివ్యపురుషుడు వెలికివచ్చాడు. ఆయన వర్చస్సుకు ముగ్ధులై ప్రచేతసులు ఆయనకు సాష్టాంగ నమస్కారాలు చేసారు. వారి ముఖకళను, వినయసంపత్తినీ చూచి ఆయన ఎంతో సంతుష్టుడైనాడు. ఆ మహాపురుషుడు స్వయంగా రుద్రుడే. ప్రచేతసులతో యిలా అన్నాడాయన-

"నాయనలారా, నాకు మీపై అనుగ్రహం కలిగింది. నాకన్నా, జీవకోటికన్నా అతీతుడైన శ్రీమన్నారాయణుని పాదపద్మాలను ఎవరు సేవిస్తారో వారు నాకు ప్రియతములవుతారు. స్వధర్మాన్ని అనుష్ఠిస్తూ, తన జన్మాంతర పుణ్యం, జ్ఞాన సంపదల చేత బ్రహ్మత్వాన్నీ, అటుపైన నన్నూ, కడపట శ్రీహరినీ పొందటం అన్నది సాధారణంగా జరుగుతుంటుంది. కానీ భగవద్భక్తులకు తిన్నగా శ్రీ మహావిష్ణువును పొందగల శక్తి ఉంటుంది. మీరు పరమ భాగవతోత్తములు. కనుక మీకు నేనొక శ్రీహరి స్తోత్రం చెప్తాను. ఇది మామూలు స్తోత్రం కాదు సుమా! సృష్టి ఆరంభంలోనే బ్రహ్మదేవుడు తన పుత్రులు సనకసనందనాదులకు నేర్పినటువంటిది. దీనిని శ్రద్ధగా అనుదినం అనవరతం పఠించిన వారికి భవసాగరాన్ని తరించగల శక్తి అలవోకగా వస్తుంది. ప్రభాతవేళ ఏకాగ్రతతో దీన్ని జపించిన వారికి కర్మవిమోచనం కలుగుతుంది.

శ్రీ విష్ణుపాదాలు తదేకదృష్టితో (మనస్సుతో) చూడగలవాడు పొరపాటున కూడా మరేమీ కోరుకోడు. అతనిలోని కాంక్షలన్నీ నశించిపోతాయి. స్వామి పాదాలనే చింతించే భాగవతులతో కలిగే స్నేహం (సత్సంగం) ఒక్క అర్ధనిమిష





మైనా చాలు- అది మోక్షం కన్నా మించినట్టిది. హరి స్మరణతో పాపవిదూరులైనవారు స్వయంగా తీర్థసములైపోతారు. అంటే వారి సాంగత్యం తీర్థక్షేత్ర సేవనంతో సమానమవుతుంది. అందుచేత అటువంటి రాగాదిరహితులై భూతదయాపరులై, ఋజువర్తనులైన భాగవతోత్తముల సంయోగం కలిగించమని శ్రీహరిని ప్రార్థించాలి" ఇలా వివరిస్తూ రుద్రుడు ఈ దిగువ (పద్యాలను) స్తోత్రాన్ని ప్రచేతసులకు బోధించాడు. చదవండి. వీలైతే రోజూ చదివి తరించండి.

"పంకజనాభాయ సంకర్షణాయ, శాంతాయ, విశ్వప్రబోధాయ, భూత
సూక్ష్మేంద్రియాత్మనే, సూక్ష్మాయ, వాసుదేవాయ, పూర్ణాయ, పుణ్యాయ, నిర్వి
కారాయ, కర్మ నిస్తారకాయ, త్రయీపాలాయ, త్రైలోక్య పాలకాయ
సోమరూపాయ, తేజో బలాఢ్యాయ, స్వయం జ్యోతిషే, దురంతాయ, కర్మ
సాధనాయ, పురాపురుషాయ, యజ్ఞ
రేతసే, జీవతృప్తాయ, పృథ్విరూప
కాయ, లోకాయ, నభసే, అంతకాయ, విశ్వ
యోనయే, విష్ణవే, జిష్ణవే నమోస్తు!
స్వర్గాపవర్గ సుద్వారాయ, సర్వరసాత్మనే, పరమహంసాయ, ధర్మ
పాలాయ, సద్ధిత ఫలరూపకాయ, కృష్ణాయ, ధర్మాత్మనే, సర్వశక్తి
యుక్తాయ, ఘనసాంఖ్య యోగీశ్వరాయ, హిరణ్యవీరాయ, రుద్రాయ, శిష్ట
నాథాయ దుష్ట వినాశాయ, శూన్య ప్రవృత్తాయ, కర్మణే, మృత్యవే, వి
రాట్ఛరీరాయ, నిఖిల ధర్మాయ, వాగ్వి
భూతయే, నివృత్తాయ, సత్వణ్యభూరి
వర్చసే2ఖిల ధర్మదేహాయ, చాత్మ
నే2 నిరుద్ధాయ నిభృతా2త్మనే నమో2స్తు!
సర్వసత్త్వాయ, దేవాయ, సన్నియామ
కాయ, బహిరంతరాత్మనే, కారణాత్మ
నే, సమస్తార్థలింగాయ, నిర్గుణాయ
వేధసే, జితాత్మక సాధవే, నమో2స్తు!"

# అన్ని పరిస్థితులలోనూ...

పూ॥పూ॥ స్వామీ యతీశ్వరానంద

("ధ్యానం - ఆధ్యాత్మిక జీవనం" నుండీ)

మీ మనస్సుకు ఏ విధంగా చెప్పి ఒప్పించుకోగలరో - ఆ విధానాన్ని నేర్చుకోవాలి. ఒక ఆవు నుంచి పాలు పితకాలంటే సరిగ్గా పాలు ఎలా పితకాలో తెలియాలి. లేకుంటే మీరా పని చేయలేరు. మీకు ఎక్కువ పాలు కావాలంటే మీరు ముందు పాలేరు కావాలి. మీరు చేసిన సద్గ్రంథ పఠనాదుల వలన మీ మనసును మంచి విషయాలతో నింపుకున్నాగానీ, దానిని ఎలా సంబాళించాలో తెలియకపోతే మీకు పాలకు బదులు తన్నులు దొరకవచ్చు.

మనసులో ఎన్నో గదులు. వాటిలో ఎన్నో చీకటి మూలలు ఉన్నాయి. వాటిని చక్కగా పరీక్షించి శుభ్రం చేయాలి. ఇప్పటి వరకూ తెరవని ఉదాత్తమైన గదులను అంటే భక్తి, వైరాగ్యం వంటి గదులను తెరిచి భగవన్మయ భావనలను లోనికి ఆహ్వానించాలి. మీకు గుచ్చుకొనే ప్రతి ముల్లూ, మీకు తగిలే ప్రతి ఎదురు దెబ్బా మిమ్మల్ని భగవంతునివైపే నడిపిస్తుందన్న విషయం తెలుసుకోండి. మనలో కలిగే నిరాశలు, నిస్పృహలు దేవుని ఆశీస్సులని గ్రహించండి. ఈ ప్రపంచపు అశాశ్వతత్వాన్ని ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటూ ఉండండి. ఏదైనా కష్టం వచ్చినా, మోయలేననిపించిన బరువు మోస్తున్నా - మీ మనసును భగవానుని దివ్యత్వపు ప్రవాహంతో నింపండి. ఆవిరి యంత్రంలో ఆవిరి పేరుకుపోయినపుడు దానిని బయటకు వదిలి ఎలా ఒత్తిడిని తగ్గిస్తారో - అలాగే మీలోని ఆవిరిని భగవంతుని వైపు మళ్లించండి. ఆయన మీ స్నేహితునిగా, తోటి ఆటగాడుగా, ఆప్తునిగా భావిస్తూ మీలోని అసంతృప్తిని వెళ్లగక్కవచ్చు. ఆయన మీకు ఎంతో చేరువలో ఉన్నారు. కానీ ఆయనను చేరుకోవటం మీకు తెలియాలి. మీరు స్వేచ్ఛగా మనసు విప్పి మాట్లాడితే ఆయన అపార్థం చేసుకోడు. ఆధ్యాత్మిక జీవనంలో భగవంతునితో అత్యంత సన్నిహితమైన బాంధవ్యాన్ని ఏర్పరచుకోవటమే ఒక ముఖ్యమైన పని.

ఆధ్యాత్మిక సాధకుడు సర్వకాల సర్వావస్థలలోను దైవం మీదే





ఆధారపడుతూ దైవం అధీనంలో ఉండటం నేర్చుకోవాలి. ప్రారంభదశలో ఏదైనా మఠం నుంచీ లేక ఎవరైనా వ్యక్తుల నుంచి సహాయం తీసుకున్నా - పోనుపోను భగవంతుడే మన జీవితానికి చుక్కాని కావాలి. ఆయన నుండే ప్రేరణ పొందడం నేర్చుకోవాలి.

మనను దైన్యం ఆవరిస్తే మనసంతా పాడైపోతుంది. కానీ, అటువంటి పరిస్థితులలో కూడా మనం, "భౌతికమైన మనశ్శరీరాలకే యీ కష్టాలు. నాలోని ఆత్మను ఇవేమీ చేయలేవు. ఆత్మను ఇవి ఏ మాత్రం బంధించలేవు" - అని మనస్సులో బలం నింపుకోవాలి. అన్నివేళలా ఆత్మవైభవాన్నీ, ఆత్మ అనుభవించే స్వేచ్ఛనూ తలుచుకుంటూ ఒక సాక్షిగా మారిపోవాలి! గొప్పగొప్ప మహనీయులందరూ యీ విధంగానే తమతమ జీవితాలలో ప్రవర్తించారు. తమ మనస్సును క్షణమాత్రంలో భగవంతుని వైపు త్రిప్పి వేసి, ఘోరమైన పరిస్థితుల వలన ప్రభావితులు కాకుండా ఉండగలిగారు.

మనలో ఆత్మ నెలకొని ఉన్నదన్న అనుభూతిని ఇవ్వగల సామర్థ్యం మనలోనే ఉంది. ఈ సామర్థ్యాన్ని మరింతగా పెంచుకోవాలి. మన ఆలోచనలు, భావనలు ఎల్లప్పుడూ భగవానుని వైపే తిరిగి ఉండాలి. బాహ్యప్రపంచంలో అంతులేని దు:ఖం, నిరాశ, నిస్పృహ, దైన్యం, బాధలు తాండవిస్తున్నాయి. అనాదిగా యీ లోకం యిలాగే ఉంది. ఈ దృశ్యమాన ప్రపంచం మంచి-చెడు, సుఖం-దు:ఖం వంటి ద్వంద్వాలతోనే ఉంది. కేవలం సంతోషమే ఎల్లకాలం ఉండదు. మీరు చెయ్యగలిగేదేమిటంటే భగవంతుని మీదనే మరింతగా ఆధారపడుతూ శరణువేడటం. నిజమైన శరణాగతి మాత్రమే శాంత్యానందాలను ఇవ్వగలదు. ఇది మీలోని శక్త్యుత్సాహాలను, పారమార్థిక భావనలను మరింత బలపరచుకునే మార్గం. ఒక ఆచరణాత్మకమైన పరిష్కారం యిది. ఈ ప్రపంచంలోని కడగండ్లు నిస్పృహాలూ అన్నీ మీకు ప్రపంచపు అశాశ్వతత్వాన్ని మాటిమాటికీ గుర్తు చేస్తుండాలి. ఈ ప్రపంచంలోని ఏ ఒక్క వస్తువు కూడా మనకు పూర్తి భద్రతా భావనను ఇవ్వలేదు. కాబట్టి సంతోషం, హాయి వంటి వాటిని యీ లోకంలో వెదకటం మానేద్దాం. భగవంతుడే వీటికి ఊటబావి. ఆయనే మనకు బలం ఇస్తాడు. ఆయన సంకల్పమే నెరవేరుతుంది. అంచేత ఆయనలో ఐక్యం చెందడానికి ప్రయత్నం చేద్దాం. ప్రతి ఆధ్యాత్మ సాధకునికీ ఉండి తీరవలసిన దృక్పథం యిదే.

# బాలవాణి

పిల్లలూ, ఇది నా గుండె కరిగించి కన్నీళ్ళు రప్పించిన విషయం రా! జాగ్రత్తగా చదవండేం!

ఓ బళ్లో మూడవ తరగతి అది. సైన్స్ క్లాసు జరుగుతోంది. తొమ్మిదేళ్ల చందూ టీచరుగారు వ్రాయమన్న ప్రశ్న-జవాబులు వ్రాస్తున్నాడు. వాడికి రాత్రంతా కొద్దిగా జ్వరం తగిలింది. నీరసంగా అనిపిస్తోంది. అందుకే ఉత్సాహంగా లేడు. టీచరుగారు తమ క్లాసులోకి, బడిలోని ఎక్వేరియమ్ (చేపలు పెంచే గాజు తొట్టె)లోని వన్నెవన్నెల చేపలు కొన్ని చిన్న నీళ్ల తొట్టెలో వేసుకొని తెచ్చి చూపిస్తున్నాగానీ వాడికి సంతోషం కలగలేదు. ఎక్కువసేపు వాటిని చూడకుండానే వచ్చి కూర్చున్నాడు. రాత్రి చెయ్యకుండా ప్రక్కకుపెట్టిన హోంవర్క్ వ్రాస్తున్నాడు. అంతలో .....

అరె! ఇదేమిటి! చందూ గతుకుమన్నాడు. అయ్యయ్యో, తన కాళ్ల మధ్యగా ....... ఛీ, ఛీ! తాను క్లాసులోనే మూత్రం పోసేస్తున్నాడు. తనకు తెలియకుండానే అలా జరిగిపోతోంది. చందూకి ఏడుపొస్తోంది. క్లాసులో పిల్లలందరూ ఎంత నవ్వుతారు! టీచరుగారు చూస్తేనో! అయ్యో, తన సీటు దాటి నడిచే దారిలోకి పోబోతోంది కూడా మూత్రం. చందు సీరియస్‌గా ప్రార్థన చేస్తున్నాడు - "దేవుడా రక్షించు, దేవుడా రక్షించు" అని. తనకెప్పుడూ యిలా జరగలేదు. ఇవ్వాళిలా అయిందేం! ఆడపిల్లలెవరైనా చూస్తే యింకెప్పుడూ తనతో మాట్లాడరు. టీచరు కొడతారేమో! చందూ కళ్లు నీటితో నిండిపోయాయి.

సరిగ్గా అప్పుడే టీచరుగారు బయటికి వెళ్లడానికి బయలుదేరారు. ఆమె చందూ ముందునుంచే వెళ్లాలి. టీచరుకన్నా ముందు నడుస్తోంది సుధీర. అది చందూకి స్నేహితురాలే. దాని చేతిలో చేపలున్న గాజుతొట్టె ఉంది. తిరిగి దానిలో నీళ్లు అక్వేరియమ్‌లో పొయ్యడానికి వెడుతోంది. సుధీర వచ్చేసింది తనదాకా. చందు గట్టిగా కళ్లు మూసేసుకున్నాడు.

మరోక్షణంలో సుధీర చందూ ముందుకు వచ్చింది. ఆమె చేతిలోని నీళ్ల తొట్టె జారి చందూ ఒళ్లో పడిపోయింది. చందూ నిండా నీళ్లు. తొట్టె మెల్లగా





జారి క్రిందికి పడిపోతోంటే చందూ చటుక్కున పట్టుకొని ఆపాడు. వాడి గుండె "థేంక్యూ దేవుడా థేంక్యూ" అంటోంది. టీచరుగారు క్రిందపడి ఎగురుతున్న చేపల్ని ఏరుకొని వెళ్లి గబగబ అక్వేరియంలో వేసారు. ఆ తర్వాత వచ్చి "అలా పడేసావేమిటి ధీరా! చూడు పాపం, చందూ బట్టలన్నీ తడిసిపోయాయి" అన్నారు. క్లాసులో అందరూ చందూవైపు జాలిగా చూస్తున్నారు. సుధీర ఏం మాట్లాడకుండా తలవంచుకొని నిలబడింది. టీచరుగారు చందూను లేపి తనతో తీసుకువెళ్లి, స్కూల్ గేమ్స్ రూములోనుంచీ ఒక స్పోర్ట్స్ డ్రెస్ తీసి, చందూకిచ్చారు. బట్టలు మార్చుకొని రమ్మని చెప్పారు. చందూ తిరిగి క్లాసులోకి వెళ్లేప్పటికి ఇద్దరు, ముగ్గురు పిల్లలు క్రిందపడిన నీళ్లన్నీ శుభ్రంగా బయటికి ఊడుస్తున్నారు. పిల్లలంతా చందూ వైపు ఎంతో సానుభూతిగా చూస్తున్నారు. చందూ మెల్లగా వెళ్లి సీట్లో కూర్చున్నాడు. వాడికి జరిగినదంతా ఓ కలలా అన్పిస్తోంది. మెల్లగా ఆఖరి పీరియడ్ అయిపోయింది.

పిల్లలంతా స్కూలు కాంపౌండ్‌లో నిలబడ్డారు. స్కూలు బస్సులు పిల్లలను ఎక్కించుకొనే హడావుడిలో ఉన్నాయి. సుధీర అప్పుడే బస్సు దగ్గరకు వస్తోంది. చందూ ఆ పిల్లకు దగ్గరగా వెళ్లాడు. సుధీర చిన్నగా నవ్వింది. "మరీ .... నువ్వు కావాలనే పడేసావు గదా టబ్" అన్నాడు చందూ మెల్లగా. సుధీర కూడా ప్రక్క వాళ్లెవ్వరికీ వినపడకుండా గుసగుసగా అంది - "అవును. నాక్కూడా ఒకసారి అలాగే జరిగింది మరి!"

అదీ జరిగింది. చూచారా పిల్లలూ, సుధీరలాంటి తొమ్మిదేళ్ల చిన్నపిల్లలో ఎంత మానవత్వం దాగి ఉందో! చందూకి అవమానం కలక్కుండా కాపాడాలన్న తపన ఉంది. టీచరు శిక్ష నుంచీ కాపాడాలన్న ఉద్దేశ్యం ఉంది. ఆ మంచిపని వలన తనకు టీచరుతో దెబ్బలు తగిలినా ఫర్వాలేదన్న ధైర్యం ఉంది. అన్నిటినీ మించి తాను పడిన యిబ్బంది మరొకరికి కలిగితే సానుభూతి చూపించగల మెత్తని మనస్సుంది. మరి - మీలో ఎందరు సుధీరలున్నారు? మీరు చేసిన మంచి పనుల గురించి మాతాజీకి - అంటే **నాకు ఉత్తరం వ్రాయండి. లేదా ఫోన్ చేయండి. (ఫోన్ నెం. 9440413455)** సాయివాణిలో వేద్దాం సరేనా!

# కృతజ్ఞత చెప్తున్నామా?

– మాతాజీ

మిత్రులారా, మనమందరం పరమాత్మ ఉనికిని విశ్వసించేవాళ్లమే. అయినాగానీ ఒక్కోసారి అవిశ్వాసంలో పడిపోతుంటాం. మంచిచెడులన్నిటికీ ఆయనే కర్త అని మర్చిపోతాం. ఎవరో ఏదో చేసారని కుంగిపోతాం, లేదా పొంగిపోతాం. అంతేకాదు - సుఖం కలిగితే అదంతా మనదేనని ఆనందిస్తాం. దు:ఖం కలిగితే మాత్రం ఆ నేరం భగవంతుడి మీద వేస్తాం. బాబా మనకెన్ని మేళ్లు చేసాడో లిస్టు వ్రాసుకోం. కీడు కలిగితే మాత్రం "ఏమిటో బాబా దయ చూపలేదు" అనుకొంటాం. ఈ విషయంలో మనకన్నా క్రైస్తవ మిత్రులు చాలా ముందున్నారు. ఏ కాస్త మేలు కలిగినాగానీ వెంటనే "సాక్ష్యమిచ్చుట" అనే పేరుతో పది మందికీ తెలిసేలా వివరిస్తారు దాన్ని గురించి. ఇది చాలా మంచి లక్షణం. ఒకటి - మన కృతజ్ఞత తెలుపుకోవటం, రెండు-తద్వారా బాబా శక్తీ, ప్రేమా తెలియని వారికి కూడా తెలియటం - రెండు ప్రయోజనాలు నెరవేరుతాయి.

నవంబరు నెలలోని ఆఖరు గురువారాన్ని "థ్యాంక్స్ గివింగ్ డే"గా పరిగణిస్తారు అమెరికన్లు. 1863లో అబ్రహామ్ లింకన్ కాలంలో ప్రారంభమైంది ఇది. ఒక్క దైవం పట్లనే కాదు - తమకు మేలు చేసిన ప్రతి వారినీ సంస్మరించుకోవటం ఆనాడు చేస్తారు అమెరికన్లు. ఐతే భారతీయుల విశ్వాస ప్రకటన లేదా కృతజ్ఞతలు తెలుపుకోవటం విభిన్నంగా ఉండి, మన ఆచార సంప్రదాయాలలో కలగలిసిపోయింది. మచ్చుకు కొన్ని చూద్దాం.

నది మనకు నీళ్లిస్తుంది. కనుక నది మీదుగా వెళ్లవలసి వస్తే పసుపు, కుంకుమ, పూలు, పళ్లు నదికి సమర్పించటం మనకు అలవాటు. పుష్కరాల పేరిట చేసే ఉత్సవాలు కూడా ఒక విధంగా దీన్నే సూచిస్తాయి. పూలూ, పళ్లూ, ఆకూ, కట్టే యిచ్చే చెట్టును పూజించటం కూడా కృతజ్ఞతాసూచకమే. పంటలు మిక్కటించి వేసే ఎలుకలను పాములు తింటాయి. అంచేత నాగపూజ చేస్తాం. అందుకనే పుట్టలు తవ్వితే పాపం - అన్నమాట వచ్చింది. గృహప్రవేశం





చేసేటపుడు ముందుగా మేస్త్రీలు, పనివాళ్లు పనిచేసిన వస్తువులను పూజించి, పనివారికి వస్త్రదానం చేసి, అప్పుడు మన మామూలు పూజ ప్రారంభిస్తాం. క్షీరదానం చేసే గోవు తల్లికి గోపూజ, వనౌషధాలిచ్చే కొండలకు గిరిపూజ యిలాటివే. వెలుగులు పంచే సూర్యుడి పూజ రథసప్తమినాడు జరిగితే, వెన్నెలలు కురిపించే చంద్రుని పూజ కార్తీక పూర్ణిమనాడు చేస్తాం. అసలు ఆ మాటకొస్తే మనం మన పూర్వులకు పెట్టే తద్దినాలు కూడా ఒక రకంగా వారు మనకు చేసిన మేళ్లను గుర్తు చేసుకొని కృతజ్ఞత చెప్పకోవడానికే అనుకోవచ్చు.

మన జాతిలో మరో వైశిష్ట్యం ఉంది - 'చేసిన మేలు చెప్పకో గూడదు' - అనేది. శ్రీ సాయినాథులు చెప్పారు - ఒక గింజ మహావృక్షంగా మారాలంటే గాలి, నేల, నీరు, వేడి, కలుపు తీసివేసినవారు, ఎరువు, కావలివారు - ఇన్నిటి, ఇందరి సహకారం అవసరం అవుతుంది. అవన్నీ నిష్కామంగానే పనిచేస్తాయి. చెట్లు మనకు మంచిగాలి, నీడ, ఫల, పుష్పాదులెన్నో యిస్తాయి. ఇవీ నిష్కామంగానే పనిచేస్తాయి. అంటే తాను యిచ్చినా చెప్పకోవు, ఎదురేమీ ఆశించవు. అంచేత మనమూ చెప్పనక్కర్లేదన్న వాదన ఒకటి ఉంది. కానీ, మనం మనుష్యులం. కాబట్టి కృతజ్ఞత తెలుపుకోవటం, కనీసం మనసులో అనుకోవటం తప్పనిసరి.

అంచేత, ప్రియ మిత్రులారా, మనం నడుపుకొనే సత్సంగాలలో పాల్గొనే సభ్యులందరూ కూడా తమకు శ్రీ సాయి వలన తొలగిన కష్టనష్టాల గురించి, అనుకోకుండా లభించిన సౌభాగ్యాలను గురించీ మన మిత్రులందరికీ చెప్పి, సాయి పట్ల విశ్వాసం పెంచటం మంచిది. అవి కేవలం భౌతికమైనవే కాక మన ఆలోచనలు, యోగ్యతలు, సాధన పెరిగేవిగా ఉంటే చాలా మంచిది.

శాస్త్ర వాక్యం ప్రకారం మనం మనకు కలిగిన బాధలను, అన్యాయాలను, అవమానాలను గుర్తుంచుకొని విచారించటం కన్న - కలిగిన ఆనందాలను, సత్ఫలితాలను గుర్తుంచుకొని మనోబలం పెంచుకొంటే మంచి జరుగుతుంది. ఆయా విషయాలకు సహకరించిన వారినీ, వారికి ఆ బుద్ధి ప్రసాదించిన పరమాత్మనూ స్మరించి కృతజ్ఞత చెప్పకోవటం కూడా ఎంతో మేలు చేస్తుంది మనకు. చివరగా పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వామీ శివానంద మాటలు మననం చేసుకుందాం.

"మీకు కలుగుతున్న, కలిగిన చేదు అనుభవాల గురించి ఆలోచిస్తూ, మనసు పాడు చేసుకోకండి. ఎదురైన మంచి ఘట్టాలను గూర్చి ఆనందించండి. అవి ప్రసాదించిన వారి పట్ల మనసు నిండా కృతజ్ఞత నింపుకోండి. ఎవరైనా మిమ్మల్ని కించపరిచారా? ఆ బాధ మర్చిపోండి. ఎవరైనా మిమ్మల్నీ, మీ మంచితనాన్నీ మెచ్చుకొన్న ఘట్టాలు గుర్తు తెచ్చుకోండి. ఎవరి నుంచైనా పొందిన మేలును కృతజ్ఞతతో కలిపి వారికి తిరిగివ్వండి. భగవంతుడు మనకు చేసిన మేలు ఎలా తీర్చుకోవడం? ఇతరులకు మనం మేలు చెయ్యటం ద్వారానేనని గుర్తుంచుకోండి. జీవితంలో ప్రతి క్షణం కృతజ్ఞత చెప్పకోవలసిన క్షణమే".

## సంస్కృతి

సాయిదీప్ - గల్లీ ఎన్నేళ్లైనా చెరిగిపోని స్మృతి మాకు. నాలుగేళ్ల బిడ్డగా వీధిలో దొరికిన గల్లీ, చామనఛాయ ముఖంలో గుండ్రని కళ్లు తిప్పతూ, చిలక గొంతుతో బోలెడన్ని కబుర్లు చెప్పే గల్లీ (ఇది వాడికి పౌరుషనామం - 'గల్లీకా దాదాకు షార్ట్‌నేమ్ - అసలు పేరు సాయిదీప్) మాతో ఏడేళ్లున్నాడు. కాళ్లూ, చేతులు నడుము పనిచేయవు గనుక ఎప్పడూ పడుకొనే ఉన్నాగానీ- ఆశ్రమంలో ఏ మూల ఏం జరుగుతున్నా మొత్తం ఇన్ఫర్మేషన్ వాడి దగ్గరుండేది. అందరికీ ఎంతో సంతోషాన్ని పంచేవాడు. ఒక్కోసారి తన మొండితనంతో విసిగించేవాడు కూడా. ఎప్పడూ చిరునవ్వులు ఒలకబోస్తూ, ఏవేవో పాటలూ, శ్లోకాలూ పాడుకొంటూ చిదానందంగా ఉండే మా గల్లీ ('అవధూత' అన్నారు గురుదేవులు వీడిని) మమ్మల్ని విడిచిపెట్టి, తోటమూల సమాధిలోకి చేరిపోయి పదకొండు సంవత్సరాలైపోయింది. అయినాగానీ సంక్రాంతి రాగానే 14వ తేదీన వాడి కళ్ల తళతళ, చిరునవ్వుల మిలమిల, కంఠపు కలరవం మాకు గుర్తు రాకా మానవు. మా గుండెలు చెమరించకా మానవు. గల్లీ సంస్మరణం నాడు జనవరి 14న "శివమహేశ్వరా" అన్న భజన వాడి సమాధి దగ్గర మారుమ్రోగకా తప్పదు.





## మంగళాశీస్సులు

మా చంద్రారెడ్డి (శ్రీ డా॥ జి.చంద్రారెడ్డి, ఉపకార్యదర్శి, శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్) చిన్నతమ్ముడు శ్రీ జి.శ్రీనివాసరెడ్డి (శ్రీమతి జ్యోతి) తమ ఏకైక పుత్రిక చి॥సౌ॥ సాయిప్రభ వివాహం చి॥ అచ్చిరెడ్డి (శ్రీ తూర్పు యాదిరెడ్డిగారి పుత్రుడు)తో 19-11-2010 నాటి ఉదయం గం.11-30లకు తుక్కుగూడ లోని ప్రేమశ్రీ గార్డెన్స్‌లో శాస్త్రోక్తంగా నిర్వహించారు. నవ వధూవరులు పరస్పరానురాగంతో కలకాలం జీవించి, తమ సత్సంతానాన్ని లోకోపకారరీతిలో పెంచి ధన్యులు కావలసిందిగా పరమపూజ్య గురుదేవులు శ్రీ సాయినాథుల వారి శుభాశీస్సులను అందజేసారు. తథాస్తు.

◆ ◆ ◆

చి॥ సిద్ధగాని సుదర్శన్‌గౌడ్ (ఈటీవి 2) వివాహం చి॥సౌ॥ నాగరాణితో 2010, డిసెంబర్ 1వ తేదీన ఉప్పల్‌లో శాస్త్రోక్తంగా జరిగింది. వధూవరులు కలకాలం అన్యోన్యంగా, సత్సంతానవంతులై జీవించాలని సాయివాణి ఆశీస్సులందిస్తుంది.

◆ ◆ ◆

చి॥ ముమ్మడి శ్రీశైలంచారి (ఉపాధ్యాయుడు, బొమ్మలరామవరం) వివాహం చి॥సౌ॥ అర్చనతో 29-11-2010 నాటి సాయంత్రం గం.6-00లకు మర్యాల (బొమ్మల రామవరం మండలం)లో శాస్త్రీయరీతిలో జరిగింది. 'నవవధూవరులకు శ్రీ సాయి వెన్నుకాపై నిలుచుగాక!" అనీ సాయివాణి ఆశీస్సులు.

కీసరకు చెందిన శ్రీ పల్లుల శ్రీధర్‌ల తమ్ముడు చి॥ కిరణ్‌కుమార్ కల్యాణం చి॥సౌ॥ కీర్తనతో మర్యాలలో 29-11-2010 మధ్యాహ్నం వైభవంగా నిర్వహించారు. వధూవరులకు శ్రీ సాయిరక్ష.

◆ ◆ ◆

# ఆదిగురువు-దత్తప్రభువు

(గత సంచిక తరువాయి)

అటుపైన నా గురువు పసిపాపడు. వాడు నిత్య సంతుష్టుడు. తననెవరైనా ముద్దాడినా, ఆడుకున్నా ఆనందంగానే ఉంటాడు. ఎవరు నవ్వించినా హాయిగా నవ్వగలడు. మానావమానాలు, గౌరవ అగౌరవాలు-ఇవేవీ అతనికి పట్టవు. ఎవ్వరినీ నిందించడు-ఎవ్వరినీ ప్రత్యేకంగా గౌరవించడు. సాధకుడు కూడా అలాగే సన్మాన అవమానాలకు, రాగద్వేషాలకు అతీతుడుగా ఉండాలనీ, తనలో తానే ఆనందిస్తూ ఉండాలనీ నేర్చుకొన్నాను.

నా ఇరువదవ గురువు ఒక కన్య. ఆమె తల్లిదండ్రులెవ్వరు యింట లేనపుడు ఆమెను పెళ్లిచూపులు చూడటానికి బంధువులు వచ్చారు. ఆ పిల్లవారందరినీ మర్యాదగా పలకరించి, అతిథిమర్యాదలు నెరిపి కూర్చుండబెట్టింది. వారికి భోజనాలు ఏర్పాటు చేయాలి. అందుకోసం రోట్లో వడ్లు పోసి దంచసాగింది. ఆమె చేతులకున్న మట్టిగాజులు ఘల్లుఘల్లున మ్రోగుతున్నాయి. ఆ చప్పుడు విని బంధువులు తమను పేదవాళ్లని చిన్నచూపు చూచి, సంబంధం వదులుకుంటారని ఆమెకు అనిపించింది. కొన్ని గాజులు తీసేసింది. అయినా శబ్దం అవుతోంది. రెండేసి గాజులే ఉంచుకొన్నది. అయినా శబ్దం తగ్గిందిగానీ ఆగలేదు. అంచేత ఆమె ఒక్కొక్క గాజు మాత్రమే ఉంచుకొని దంచసాగింది. అప్పుడు నిశ్శబ్దంగా పని జరిగింది.

సాధకుడు పదిమందితో కలిసి కూర్చుంటే ఏవో రకరకాల సంభాషలు వస్తాయి. సమయం వ్యర్థమవుతుంది. ఎదుటి వాళ్ల ప్రభావం మన మీద పడుతుంది. ఏకాగ్రత దెబ్బతింటుంది. అందుచేత సాధకుడు ఎప్పుడైనా ఏకాంతంగా ఉండటం సరియైన విధానమని నేను నేర్చుకొన్నాను.

నాకు ఇరువది ఒక్కటవ మార్గదర్శి ఒక బాణాలు తయారుచేసే నిపుణుడు. అతడు తన పనిలో నిమగ్నుడై ఉన్నపుడు ప్రక్కనుండీ మహారాజుగారి





గజారోహణోత్సవం వెళ్లింది. వెంట వందలమంది సైనికులున్నారు. ఈ కోలాహలం ఏదీ ఆ బాణాలు చేసే వాడికి పట్టలేదు. తలెత్తకుండా తన పనేదో తాను చేసుకుంటూ పోతున్నాడు. ఇదంతా చూచిన ఒక సాధకుడు అతని దగ్గరకు వచ్చి "ఏమయ్యా! ఏనుగెక్కిన ప్రభువు ఎంతో లీవిగా ఉన్నారు గదా! అసలు నీవా ఉత్సవం చూచావా?" అని అడిగాడు. ఆ శరకారుడు అప్పటికి కూడా తలెత్తలేదు. చేత్తోనే చూడలేదని సైగ చేసాడు. తన పని పూర్తి అయ్యేవరకు అతడు ఏమాత్రం సంచలనం లేకుండా కూర్చొని బాణం పూర్తి చేసాడు. అది చూచి నేను ఏదైనా సాధించవలసిన వాడికి ఎంత నిశ్చలత ఉండాలో తెలుసు కున్నాను. సాధకుడు విషయానందాల ఆకర్షణకు లోను కాకుండా తన లక్ష్యం వైపు సాగిపోతూనే ఉండాలనీ, అవతలి వారెంతటివారైనా, అవతల ఉన్నది ఎంత ఆకర్షవంతమైన దృశ్యమైనా అతడు చలించరాదనీ నేర్చుకున్నాను.

తదుపరి నా గురువు సర్పం. పాము చాలా నిశ్శబ్దంగా సంచరిస్తూ ఉంటుంది. తన పొలకువ యితరులకు తెలియరాకుండా సంచరిస్తుంది. తనకంటూ ఓ గూడో, పుట్టో ఏర్పరచుకోదు. చీమలు పెట్టుకున్న పుట్టలోనే తాను తలదాచుకొంటుంది. గృహస్థులు తమ జీవనం కోసం భూములూ, పుట్రలూ, ఇళ్లూ, వాకిళ్లూ ఏర్పరచుకొంటారు. వాటిని ఏర్పరచుకోవటంలోనూ, రక్షించుకోవటంలోనే వాళ్ల జీవితాల్లో ఎక్కువభాగం వ్యయమైపోతూ ఉంటుంది. అందుచేత సాధకుడైనవాడు తనకంటూ ఓ స్థావరం ఏర్పరచుకోవాలని ప్రయత్నించకూడదు. ఆశ్రమాలు, దేవాలయాలలో ఆశ్రయాన్ని పొందుతూ, పొందిన దానితో తృప్తిపడుతూ ఉండాలని నేర్చుకున్నాను.

నా ఇరువది మూడవ గురువు సాలెపురుగు. దీనిపేరే ఊర్ణనాభి. అంటే తన లోపలినుంచీ దారం తయారుచెయ్యగలది అని అర్థం. దాని నోట్లో నుండీ ఒక రకమైన జిగురుద్రవం వస్తుంది. అది బయటకు రాగానే దారంగా మారుతుంది. అలాటి దారాన్ని ఆధారంగా చేసికొని అది రకరకాల ఆకృతులు తయారుచేస్తుంది. గూళ్లు, భవనాలు ఏమేమిటో విచిత్రమైన నిర్మాణాలు తయారవుతాయి - దాని నోటిలో తయారయ్యే నూలుతో కొంతసేపు అలా

కడుతూ కడుతూ ఆ మూలకూ యీ మూలకూ సంచరిస్తుంది. ఉన్నట్లుండి హఠాత్తుగా ఆ దారాన్ని తిరిగి మింగేస్తుంది. ఆ నిర్మాణాలేవీ కూడా నిలవవు. ఇలా తయారుచేయటం అలా తిరిగి తనలోకే లాక్కోవటం సాలెపురుగుకొక ఆట. ఈ సృష్టి సర్వం పరమాత్మకొక లీల - ఒక హేల - ఆయన నటవరుడు. తన శక్తినే ఎన్నెన్నో అనంతరూపాలుగా, జీవులుగా, నిర్జీవులుగా, గిరులుగా, తరులుగా, నదులుగా - ఇదీ అదీ అని ఏముంది - సమస్త సృష్టినీ అలవోకగా అలా నిలుపుతాడు. మనిషి ఈ ఇళ్లు, వాకిళ్లు, బాంధవ్యాలు, ఆనందాలు, విషాదాలు - అన్నీ తనవేననుకొని పొంగిపోతుంటాడు. కొన్నిసార్లు క్రుంగిపోతుం టాడు కూడా. కానీ, పరమాత్మ తన లీల - తన ఖేల పూర్తికాగానే ప్రళయం సృష్టించి, మొత్తాన్నీ తన లోపలికి లయించుకొంటాడు. ఈ సృష్టి యావత్తు పరమాత్మలోనుండీ వచ్చిందే. అది ఆయనకే చెందుతుంది. అలాంటప్పుడు ఇది నాది అది నీది' అని తగువులు, అహంకారాలు - ఎంత మూర్ఖత్వం!! ఊర్ణనాభి నాకీ విషయం నేర్పింది.

ఇక నా చిట్టచివరి గురువు ఒక రకమైన తుమ్మెద. ఇది ఒక పురుగును పట్టుకొని వచ్చి తన గూటిలో ఉంచుతుంది. ఒకసారి దానిని గట్టిగా కుడుతుంది. అటుపైన ఆ గూటి ద్వారం మట్టితోమూసి, దాని చుట్టూ తిరిగి ఝుంకారం చేస్తుంది. ఆ నాదం విని లోపలున్న పురుగు మళ్లీ అది వస్తుందేమో- ఎటునుండీ వస్తుందో అన్న భయంతో, కంగారుతో తుమ్మెద గురించే ఆలోచిస్తూంటుంది. అలా దాని గొంతు విని విని, దాని రూపం ధ్యానించి, ధ్యానించి ఇది కూడా తుమ్మెదగా మారిపోతుంది. దీన్ని చూచి నేనొక గొప్ప రహస్యాన్ని కనుగొనగలిగాను. పరమాత్ముడు ధ్యేయం. మన మనస్సే ధ్యాత. మనస్సు సహజంగా చంచలమైనది. కానీ, విషయవిశ్లేషణ చేసుకొని, సవ్యమైన మార్గాన్ని ఎంచుకున్న బుద్ధరూపిణి అయిన మనస్సు మనకు ఆప్తమిత్రుడు. దానికొక్కసారి మార్గోపదేశం చేసి, ఎటూ చెదరకుండా బంధించి పెడితే నిరంతరం స్వామి ధ్యానం చేసిచేసి అది కూడా పూర్తిగా ధ్యేయమైన పరమాత్మతో సారూప్యమే పొందుతుంది. దీనినే సారూప్యభక్తి అంటారు. తుమ్మెద





ఆ విధంగా నాకు బోధ చేసింది.

యదురాజా, పేరుకు ఇరవై నలుగురు గురువులని అన్నానేగానీ ప్రపంచం అంతా నా గురువే. ప్రతి అణువు నుంచీ మనం ఏదో ఒకటి నేర్చుకోగలం. ఎటొచ్చీ నేర్చుకునే స్వభావం ఉండాలి అంతే! మానవదేహం పరమ మోసకారి. ఇది ఎన్నెన్నో కోరుకొంటుంది. అవి దొరికితే పొంగిపోతుంది - దొరక్కపోతే క్రుంగిపోతుంది. తన కళ్ల ముందు వందలాది వేలాదిమంది మరణించటం చూస్తుంది. వచ్చేటప్పుడు గుప్పిళ్లు మూసుకొని దైవమిచ్చిన పాథేయం (దారిబత్తెం) తెచ్చుకున్న మనిషి - గత జన్మల పాపపుణ్యఫలమైన ఆ పాథేయం మొత్తం అవజేసుకొని చివరికి చేతులు తెరిచి చూపిస్తూ చచ్చిపోతాడనీ చూస్తుంది. కానీ తాను మాత్రం స్థిరమనుకొంటుంది. ఎంతటివాడైనా సరే మృత్యువు ముందు తలవంచక తప్పదు. ఎన్ని కోట్లకు తాను అధిపతి అయినా పూచిక పుల్లయినా వెంట తీసుకుపోలేడు - ఇవన్నీ తెలిసినా సరే మనిషి నేర్చుకోడు. తాను మాత్రం శాశ్వతమన్నట్లే ప్రాకులాడుతాడు. "బాలాదపి సుభాషితమ్" - మంచిమాట పసిబిడ్డ దగ్గరినుంచైనా సరే నేర్చుకోవాలని శాస్త్రాలు చెప్తే - వీడు శాస్త్రాల నుంచీ కూడా నేర్చుకోడు. పైగా వీడికి వివేకం ఇచ్చాడు పరమాత్ముడు. ఐనా ఉపయోగించుకోడు.

పైన చెప్పిన నా గురువులంతా బోధించింది ఒక్కటే. జీవితం శాశ్వతం. శాశ్వత పదార్థం కోసం ప్రయత్నించాలి. అది కూడా ఏకాంతంలో - ఏకాగ్రతతో. సాధకుడు ఓర్పు, నిర్మలచిత్తం, ఆత్మవిచారం కలిగి ఉండాలి. జిహ్వాచాపల్యం వదలాలి. స్త్రీ పట్ల కాంక్ష, గానాది వినోదాల పట్ల మోజు సాధకునికి తగవు. దైవదత్తమైన దానితో సంతృప్తి చెందాలి. ఇవి నేర్చుకోవటంలోనే జీవనసాఫల్యం ఉంది. ఓయి యదురాజా! మొత్తం సారాంశం యిదేనయ్యా!" దత్తాత్రేయుని బోధతో యదురాజు పరమమార్గంలో ప్రవేశించి ధన్యుడైనాడు. ఇంతకీ దత్తాత్రేయులు త్రిమూర్త్యాత్మకులు కదా! వారు నేర్చుకోవటం ఏమిటి? - మనకు నేర్పటానికే పై బోధ.

◆ (సశేషం)

# మాతృసంస్థ కబుర్లు

నవంబరు 5వ తేదీన ఆలయం దీపకాంతులతో తళతళలాడుగా - ఉష ముంగిలి మా పిల్లకోతులు గంతులేస్తూ కాల్చిన టపాకాయల కాంతులతో కళకళలాడింది. (పెద్దగున్నల లక్ష్మీబాంబులు, తారాజువ్వలు, రాకెట్లు వగైరా భీకర నాదాలు వీటికి మినహాయింపు) మొత్తం మీద ఘనంగా దీపావళిని మా ముంగిటికి తెచ్చిన శ్రీమతి ఇందిరత్తయ్య, శ్రీ రవీంద్రరెడ్డి మామయ్యలకు శ్రీ అల్లూరి సీతారామరాజు మామయ్యగారికీ 'ఉష' శిశుమందిరం కృతజ్ఞతలు. నవంబరు 14వ తేదీ సాయంత్రం పిల్లలకు ఆటల పోటీలు, బహుమతి ప్రదానం జరిగాయి.

నవంబరు 17వ తేదీ ఏకాదశినాడు సాయిధామంలో సుమారు 50 మంది పిల్లలకు బాలదీక్షలివ్వటం జరిగింది. హోమపూర్వకంగా యిచ్చిన యీ దీక్షలలో పిల్లలంతా ఎంతో శ్రద్ధాసక్తులతో పాల్గొన్నారు. యావాపూర్‌తండా, హాజీపూరు, బొమ్మల రామవరం, పర్వతాపురం, సాయిధామంల పిల్లలు పదకొండు రోజులపాటు చక్కని క్రమశిక్షణతో, సమయపాలనతో నగర సంకీర్తన, ఉదయ పూజ, సాయంపూజ, ఏకభుక్తం, వాక్సంయమనం, జపం, పారాయణ, సాయి రామకోటి లిఖిత జపయజ్ఞం - యిలా అన్నీ సక్రమంగా జరిపారు. దుష్టవాక్కులు రానివ్వకపోవటం, అసత్యమాడకపోవటం, ఎవరికీ చెడు కోరకపోవటం, దానం చేయటం, నిర్మలంగా బ్రతకటం వంటి సదాచారాలు పాటించారు. దీక్ష చివరిరోజున సాయిభిక్ష చేసి గ్రామమంతటికీ సాయి ప్రసాద వితరణ చేసారు. 28వ తేదీ వేకువజాములోనే లేచి, పాదయాత్రతో పది మైళ్లు నడిచివచ్చారు యావాపూరుతండా బాలురు. దారిలో రామవరం, హాజీపురం పిల్లలు కూడా కలిసారు. పర్వతాపురం వారూ కాలినడకనే వచ్చారు.

ఉదయం ఆరున్నరకల్లా గుడి దగ్గర కోలాహలం మొదలైంది. దత్తాత్రేయ స్వామి ఎదుట అందరినీ కూర్చోబెట్టి పూజ చేయించారు గురుదేవులు.





శాస్త్రోక్తంగా మాలా విసర్జన జరిగింది.

పిల్లలు తమ భిక్షాటన గురించీ, తాము నేర్చుకున్న మంచి విషయాలను గురించీ, బాబా చరిత్రలోని కొన్ని విషయాలను గురించీ చెప్తూ, తమ అనుభవాలు మాతాజీతో పంచుకున్నారు. ఉదయం పూజల తరువాత పిల్లలంతా తీపి పదార్థాలు, ఫలాహారం చేసి తమతమ ఊళ్లకు తరలిపోయారు. ఇది కనీసం 21 రోజులైనా ఉంటే బాగుంటుందన్న భావాన్ని వెలిబుచ్చారు. అటుపైన గురువారం నాడు మత్స్యమాంసాదులకు దూరంగా ఉండాలన్న మాతాజీ సలహాకు వారంతా అంగీకరించారు. ఆదివారం సూర్యుని తేజాన్ని స్వీకరించటానికి తగినట్లుగా మాంసాహారం, తలంట్లు, మద్యపానం వగైరాలు విడిచిపెట్టాలని తమ పెద్దలకు కూడా చెప్తామని పిల్లలు ముందుకు రావటం ముదావహం.

నవంబరు 18వ తేదీ క్షీరాబ్ధి ద్వాదశి. దీనినే చిలుకు (పాలకడలిని చిలికిన) ద్వాదశి అంటారు. ఆ రోజు తులసీ రూపంలో లక్ష్మి ఆవిర్భవించిందని కొందరంటారు. ఆనాడు ఉసిరిచెట్టు క్రింద తులసిని ప్రతిష్ఠించి పూజించటం హిందువుల ఆచారం. ఆచారం కోసం కాకపోయినా ఆరోగ్యపరంగానైనా గుర్తుంచుకోవలసిన పర్వదినం యిది. ఈ ఋతువులో వచ్చే శ్వాసకోశ సంబంధమైన వ్యాధులకు, దగ్గు, జలుబు వంటి వాటికి, ఒంటి దురదలకు కూడా ఉసిరిక పళ్లు, తులసి ఆకులు రెండూ శ్రేష్ఠమైన మందులు. వాటి మీది నుండీ వచ్చే గాలి కూడా ఎంతో మేలు చేస్తుంది. అమృతఫలం అని ఉసిరికి పేరున్నది. ఇక తులసినైతే 'మాతా' అనే పిలుస్తాం. అలాంటి వాటిని పూజించే క్షీరాబ్ధి ద్వాదశినాటి సాయంత్రం ఆశ్రమంలోని కన్యలు, ముత్తైదువలు గుడి ఎదురుగా ఉన్న ఉసిరిక చెట్టు క్రింద తులసి పూజ చేసుకున్నారు.

21వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా రాత్రి కార్తీక దీప తోరణాలు వెలిగాయి. ఉదయం పది గంటలకు ద్వారవతిలో శ్రీ సాయినాథ వ్రతం జరిగింది. మొత్తం మీద కార్తీకమాసం అంతా కూడా వనభోజనాలకు, సాయి దర్శనానికి, దీక్షలకు వచ్చే భక్తులతో నిండిపోయి సాయిధామం అంతా కోలాహలంగా ఉండిపోయింది.

# మాతృ సందేశం

**- శ్రీ మల్లెమాల**

'మల్లెమాల' మంచి పండితునిగా, కవిగా, గేయకారునిగా, సినిమా కవిగా తెలుగు ప్రజలందరికీ సపరిచితులు. వీరు రచించిన మల్లెమాల రామాయణం మంచి రసవంతమైన రమ్యకథనం. దీనికి ఉపోద్ఘాతంగా కవిగారు తాము రామాయణం ఎందుకు మళ్లీ వ్రాయవలసి వచ్చిందో వివరణ యిచ్చారు. అలనాటి రంగనాథ రామాయణం, భాస్కర రామాయణం, మొల్ల రామాయణం, నిర్వచనోత్తర రామాయణం (తిక్కన), ఉత్తర రామాయణం (కంకంటి పాపరాజు), విశ్వనాథ వారి రామాయణం (మధ్యాక్కరలు), శిష్ట్లా రామాయణం ........... ఎన్నో, ఎన్నో, మరెన్నో ఉండగా మరొకటెందుకు? వారంతా "పలికించెడి వాడు రామభద్రుండనీ, పలికిన భవహరమగు"ననీ నమ్మి పలికినవారు. కానీ, వీరు రామాయణం "దారితప్పిన మనుజుల ధర్మమార్గమునకు మళ్లించు ఘనచరిత్ర" అన్న కొండంత ఆశతో, నేటి భరతఖండానికిదే తిరుగులేని మార్గోపదేశకమన్న ప్రబలమైన విశ్వాసంతో వ్రాసారు.

వారి పద్యాలరీతిని, మధుర మంజులగతినీ, ద్రాక్షా పాకానబడిన వారి శైలినీ - ముఖ్యంగా వారి ఆశయాన్నీ చదివాక - యీ 'తొలినుడి' పద్యాలలోని వారి ఆవేదనను సాయివాణి పాఠకులకు అందించాలనిపించింది. చదివి పరవశించండి.

***- సంపాదకులు***

తే. వేల సంవత్సరాలుగా విశ్వమందు
వేదభూమిగ ఎనలేని పేరుగాంచి
భిన్న సంస్కృతులకు గొప్పవేదియగుచు
వరలుచున్నది సువిశాల భరతభూమి. 1





తే. హిందువులు ముస్లిములు సిక్కు లందరొక్క
తీవపూవులవలె మతాతీతమైన
భావ మూపిరిగా భాయి భాయి యనుచు
కలిసి జీవించుచుండి రీగడ్డమీద. 2

తే. కాలమునుబట్టి అన్ని మతాల వారు
వేరువేరుగ పండుగల్ వారి వారి
సంస్కృతిని గుర్తు జేయుచు జరుపుకొనుట
ఆనవాయితిగా నున్నదాది నుండి. 3

తే. కాని ప్రజలంద రొకటిగా కలసి మెలసి
అనుపమానంద సంభరితాత్ములౌచు
జయపతాకను చేబూని జరుపుకొనిన
పండుగాగస్టు పదునైదు ప్రథమముగను. 4

తే. ఆనా డంబరమంటు సంబరముతో నాబాల వృద్ధమ్ము, తా
మేనాడున్ తలపోయనట్టి పగిదిన్ ఎంతో వినూత్నముగా
నానారీతుల వేడుకల్ జరుపుకొన్నారా వినోదమ్ములో
నేనున్ పాల్గొని ఆడిపాడితిని నా నేత్రాలు విప్పారగన్. 5

తే. మంచుమలనుండి కన్యాకుమారి వరకు
నాడు జరిగిన ఆనందనర్తనమ్ము
గడియగడియకు కన్నుల గట్టినట్లు
నిత్య మగుపించు నా మనోనేత్రమునకు. 6

ఆ. సకల జనులు దేశ స్వాతంత్ర్య స్వర్ణోత్స
వములు జరుపుకొనిన వైన మరసి
నేను గతమునంత నెమరు వేసికొనుచు
మేలి ఊహలందు దేలిపోతి. 7

క. అప్పుడు నా స్మృతి పథమున
చప్పున గనుపించె నొక్క సాధ్వీమణి, ఆ

ఒప్పెసలారు మొగమ్మున
గప్పిన శోకమును గాంచి కలవరపడితిన్. 8

తే. అంతలో తేరుకొని నాలుగైదుసార్లు
తరచి చూచితి నా మది దగ్ధమాయె !
ఆమె వేరెవ్వరో గాదు అక్షరాల
పరమసౌభాగ్య సముపేత, భరతమాత! 9

క. చింతయె రూపము గొనినటు
చెంతన్ ప్రత్యక్షమైన స్త్రీరత్నముతో
గొంతుక తడబడి వణకగ
ఎంతయు తర్కించి చివర కేనిట్లంటిన్ 10

శా. అమ్మా! భారతమాత! ఏమిటిది? ఈ ఆగస్టు పర్వమ్మునన్
నెమ్మోమెందుకు కందిపోయినది? కన్నీరేటికో చెప్ప మో
యమ్మా! చెప్పక యున్న నాకెటుల నీ అంతర్య మర్మమ్మగున్
చెమ్మంగిల్లిన కన్నులం గనిన నా చిత్తమ్ము క్షోభించెడిన్. 11

తే. అనుచు భారతజనయిత్రి నడిగినాడ!
ఆమె నా వంక తమిదీరునటుల జూచి
కారణము నీకు తెలియదా కవికుమార?
అయిన తెల్పెద వినుము నా ఆత్మఘోష. 12

సామాన్య వ్యక్తులు మన బాహ్యవర్తనం యొక్క తేలికదనం చేత వేరుగా తలచి కీడు చేస్తారు. వారికీ, మనకీ కూడా కీడు కలుగుతుంది. అందుచేత ఎప్పటికీ - ఆశ్రమ వాసులతోనైనా సరే - భద్రదృష్టితో సంచరించు. శీలాన్ని కాపాడుకో. సాధ్యమైనంతవరకు సత్యదృష్టితో సంచరిస్తూ, ఒక ప్రక్క యితరులు అపార్థం చేసుకొనే మన నడతలను, మనమే కనిపెట్టి సవరించుకోవాలి.

**- శ్రీ కేశవతీర్థ స్వామి**





# స్వాతంత్ర్య సమరయోధుల సంస్మరణ

## జనవరి 26 గణతంత్ర దినోత్సవ సందర్భంగా

– సిలువేరు సుదర్శన్

ప్రస్తుతం విద్యనభ్యసించు బాల బాలికలే రేపటి పౌరులుగా మారుతారు. వారే దేశాధినేతలుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా ముందు తరంలో వెలుగుతారు. కనుక ఈ దశలోనే దేశభక్తిని, మహనీయుల వైశిష్ట్యాన్ని మనం విశదీకరించవలయును. క్రమశిక్షణతోపాటు దేశప్రేమను, సద్భావనను, గౌరవ భావాలను దేశం పట్ల, పౌరుల పట్ల పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా కలదు. త్యాగశీలుగ చరిత్రలను బోధించాలి. నిస్వార్థసేవకు వీరు మున్ముందు పునరంకితులయ్యే దిశగా మలచాల్సి వుంది.

దేశప్రేమతోపాటు మంచి అన్నది పెంచి పోషించేలాగా దేశభక్తిని భాష, సాహిత్యాలు, కళలు దేశానికి హితకరంగా మలచేలాగా ఆకాంక్షించిన నవయుగ వైతాళికులు రాజారామమోహనరాయ్, వివేకానంద, గాంధీలాంటి వారినీ సందర్భాన స్మరించుకోవాలి.

త్యాగనిరతి, లక్ష్యాలు, ఆశయాలు, కృషి, విశిష్టతలను ఈ తరం వారికి అందజేయకపోవడం శోచనీయం. అలాగే తెలుసుకోవాలన్న తపన సన్నగిల్లడం బాధాకరం. ప్రతిభావంతులైన మహానుభావులు సమ సమాజము వైపు, అభ్యుదయ మార్గంవైపు నడిపించారు. సర్వతోముఖాభివృద్ధికి పాటుపడిన మహాత్ములందరూ ప్రాతఃస్మరణీయులు.

బ్రిటీష్ పాలన నుండి మాతృదేశాన్ని విముక్తి గావించడానికి 90 సంవత్సరాల పోరాటం 1857లో సిపాయిల తిరుగుబాటు అనే పేరు బ్రిటిషు వారిచే పెట్టబడిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంతో ప్రారంభమై 1946లో నావికుల తిరుగుబాటుతో పూర్తయింది. 1915లో భారతదేశానికి వచ్చి సమరంలో ఒక్క త్రాటి మీద జనాన్ని నడిపించారు గాంధీగారు. ఆదర్శవంత ఆచరణ, నిరాడంబరత, నిజాయితీ, సత్యసంధత, శాంతిమార్గం, కార్యసాధనకై అహింసా వ్రతం, సకల మానవ సౌభ్రాతృత్వం అనే లక్షణాలతో వారు ప్రజల హృదయాలను

దోచుకున్నారు. వారి వాక్కే వేదవాక్కు అయినది. జలియన్ వాలాబాగ్ ఉ దంతాన్ని ఖండించి జైలు పాలయ్యారు. హరిజనోద్ధరణ, మద్యపాన నిషేధోద్య మాన్ని కొనసాగించారు. సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం చేపట్టారు. సంపూర్ణ స్వాతంత్ర్యమే ధ్యేయమై సాగారు. క్విట్ ఇండియాతో కటకటాల వెనుకకు వెళ్ళిపోయారు.

ఈ ఉద్యమాలలో వేలమంది అసువులు బాసారు. త్యాగాలు చేశారు. అహింసతోపాటు రక్తతర్పణం చేసిన వీరనారీమణులు, జవానులు కోకొల్లలు. వారందరి త్యాగఫలితమే ఈ స్వాతంత్ర్యము సుభాష్ చంద్రబోస్, భగత్సింగ్‌లాంటి వారు వేరే పంథాలో పయనించినా లక్ష్యము ఒక్కటిగా ఉండినది. ఉద్యమాలు దేశభక్తి, త్యాగశీలతతో కూడి అత్యున్నత శిబిరాలను చేరాయి. ఇది మనందరికి ఆదర్శం కావాలి. మన యువత స్మరణకు పదేపదే తెచ్చుకోవలసిన దినమిది.

ప్రీతి వడ్డదర్ చిటగాంగ్‌కి చెందిన వీరవనిత, బ్రిటీష్ వారిని ఆయుధాలతో ఎదిరించి పోరాడిన వీరనారి, సాహితీమణి, వ్యాయామంలో శిక్షణ పొందింది. ఈమె స్నేహితురాలు కల్పనాదత్. 17 సం॥ల ప్రాయంలోనే 'దీపావళి సంఘ్' అనే సంస్థలో చేరారు. కత్తిసాము, కర్రసాము, తుపాకిని ఉపయోగించడంలో ప్రావీణ్యతను సంపాదించారు. సూర్యసేన్, అనంత్‌సింగ్‌లో కలసి పనిచేశారు. విప్లవకారుల పంచన చేరి తుపాకి చేబూని యుద్ధానికి పాల్పడ్డారు. రామకృష్ణ బిశ్వాస్‌ని బ్రిటీష్‌వారు అలీపూరు జైల్లో నిర్బంధించారు. ఆ యువకుని ఈమె రహస్యంగా కలవడం జరిగేది. 1932లో మే నెల 24న బాంబుదాడి గావించింది. బ్రిటీష్ వారికి లొంగిపోక 'పొటాషియం సైనైడ్' పుచ్చుకొని ప్రాణత్యాగానికి ఒడిగట్టింది.

ఆలీపూరు కుట్ర కేసు, చిట్టగాంగ్ కుట్ర కేసు, కాకోరీ కుట్ర కేసు - యిలా ఏదో ఒక పేరుతో కేసులు పెట్టి, విచారణలో నిజాయితీని పాటించకుండా జడ్జిమెంట్ ముందే వ్రాసుకొని ఆర్గ్యుమెంట్లు విన్న తంతు పూర్తి చేసి లేలేత మొగ్గల గొంతులకు ఉరిత్రాళ్లు బిగించింది ఆంగ్లప్రభుత్వం.

టేగ్రా బాలవీరుడు. ఈ బాలుడి వయస్సు 14 సం॥లు. మధ్యతరగతిలో జన్మించాడు. ఇద్దరు అన్నలుండేవారు. కుటుంబమంతా స్వాతంత్ర్యవీరులే. బాబు అసలు నామధేయం హరగోపాల్. ఆటపాటలధిక మిష్టం. మొండితనం, మంకు





పట్టని గుర్తించి అందరు టైగర్ అనేవారు. క్రమంగా టైగ్రాగా మారింది. బెంగాల్ విభజనతో విప్లవానికి పునాదులేర్పడ్డాయి. యువకులు మూకుమ్మడిగా టెర్రరిస్టు లుగా మారారు. భగత్‌సింగ్, ఆజాద్‌ల మార్గాన్ని వీరెంచుకున్నారు. యుద్ధ విద్యలో ఆరితేరారు. ఓ దానికి సూర్యసేన్ నాయకత్వం వహించాడు. టేగ్రా మాతృమూర్తి "వీరు ముగ్గురిలో చిన్నవాడు నాకు ప్రాణం సూర్యసేన్‌ను విడచిపెట్ట"మంది. 18-4-1930లో అకస్మాత్తుగా దాడి జరుగగ టేగ్రా ఆయుధం ధరించాడు. ఏప్రియల్ 22న దాడి జరుగగ టేగ్రా ఆయుధం ధరించాడు. ఏప్రిల్ 22న దాడి ఉధృతమై ఒక తూటా టేగ్రా గుండెల్లో నుండి దూసుకెళ్లింది. రక్తపు మడుగులో ఉండిపోయాడు. వీరుడిలా పోరాడి తుదిశ్వాసను విడిచి నిజంగా వీరపులిగా మిగిలాడు బాలటేగ్రా.

షాజన్‌పూర్ సంపన్నకుటుంబంలో జన్మించాడు అష్ఫఖ్‌ఉల్లాఖాన్. క్రీడలు, వ్యాయామంలో ఆసక్తి అధికం. ముస్లిం మత విశ్వాసమున్నా ఇతర మతాలను సాంప్రదాయాలను అమితంగా గౌరవించేవాడు. ముస్లింలు ప్రవేశించకూడదన్న హిందూ దేవాలయాలలో హిందూ వేషధారణతో దర్శించేవాడు. అందరి లక్ష్యం ఒక్కటేయని విశ్వసించేవాడు. ముక్తకంఠంతో నొక్కి వక్కాణించేవాడు. "భారత్ ప్రజాతంత్ర్‌కి జై" 'సామ్రాజ్యవాదం నశించాలి' అని భారతమాతను దేవతగా ఎంచి బానిస బంధాల నుండి విముక్తి గావించాలని పోరాటం సాగించి తన పవిత్ర ఆశయసాధనకై అసువులు బాసాడు. "మతం వ్యక్తిగతం. ఉద్యమం అందరిదీ" అని భారతీయుల ఆత్మను ఆవిష్కరింపజేశాడు ఆ వీరుడు. కకోరి అలాటి పుణ్యభూమి ప్రస్తుతం అది మత విద్వేషాలతో మారణహోమవేదికగా నిలవడం బాధాకరం. మాతృదేశం కోసం ఫజియాబాద్ జైలులో ఉరికంబ మెక్కాడు. అష్ఫఖ్‌ఉల్లాఖాన్. ఇప్పుడు ఆ ఫజియాబాద్ కూడా మతోన్మాదంతో విషం కక్కుతూ ఉంది.

ఈ తరం యువత తమ మత్తు నిద్ర విడచి, విషయలాలసలను విదిలించు కొని పట్టిపీడిస్తున్న దుర్గతలను రూపుమాపడానికి కంకణం కట్టుకొని కొదమసింగాలై దుమకాలని కోరుతూ, భారతమాతకు వందనాలర్పిస్తున్నాను.

ఉన్నతమైన ఆలోచనలు, ఉదారమైన ఆశయాలు కలబోసుకుంటే చక్కటి నడవడిక అదే తయారౌతుంది.